ప్రజలే ప్రభువులు

# జనబలం

ఏప్రిల్ 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-






## యుద్ధం..పర్యవసానాలు

## 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు

## స్పీకర్.. చట్టసభల పనితీరు




## ఉచితాలపై 'సుప్రీం'కొరడా





# కళాశాల విద్యలో రిలాక్సయిపోవద్దు: జేపీ

మన విద్యావ్యవస్థలో సక్సెస్ అంటే ఆటపాటలు, ఇతరత్రా వ్యాపకాలు లేకుండా గంటల తరబడి బట్టీపట్టటం; ప్లస్ టూ లో అయితే సెలవులనేవే లేకుండా రకరకాల ఎంట్రెన్స్ పరీక్షలకు సిద్ధమవటం వంటి కారణాల వల్ల డిగ్రీ కళాశాల చదువుల్లోకి వచ్చేసరికి చాలామంది విద్యార్థులు ఒక్కసారిగా స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లు తేలిగ్గా తీసుకుంటారని.. వాస్తవానికి కెరీర్‌ను దెబ్బతీసే అలసత్వమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హెచ్చరించారు. లోతైన అధ్యయనంతో సొంతంగా ఆలోచించి ఎదగటానికి కళాశాల దశ సరైన సమయమన్నారు. మంచి పాఠశాల విద్యకు అది కొనసాగింపు కావాలన్నారు. మానవాళి చరిత్రలో ఎన్నడూలేని స్థాయి సాంకేతికత ఈ యుగంలో అందుబాటులో ఉందని, సామాజిక మాధ్యమాల్లో సమయం వృథా చేయకుండా టెక్నాలజీని సద్వినియోగం గావించుకోవాలన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం సెంట్రల్ గ్రంథాలయ ఆవరణలో జరిగిన వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం, వార్షికోత్సవంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజం పట్ల ఏదైనా మంచి చేయాలని తపన గల యువత ప్రభుత్వోద్యోగాల కోసం ఒక ప్రయత్నం చేయాలని, కానీ అవే సర్వస్వమని సమయం వృథా చేసుకోవద్దన్నారు. ప్రభుత్వంలో ఉద్యోగం వస్తే నిజాయతీ, సామర్థ్యం, ప్రజల్లోని బలాన్ని వెలికితీసే రీతిలో, వ్యవస్థల్ని బలోపేతం చేస్తూ సేవలందించాలన్నారు. ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నుల్ని, ప్రపంచ పరిణామాలను ఆకళింపు గావించుకోగలిగితే.. మార్కెట్‌లోనూ అద్భుత అవకాశాలున్నాయన్నారు. మన దేశంలో ఊహించనిరీతి ఉపాధి, సంపదసృష్టి అవకాశాలు రానున్నాయన్నారు. భవిష్యత్తు అందంగా ఉంటుందని, అయితే అందుకు దూరదృష్టి, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి, క్రమశిక్షణ, కష్టపడేతత్వం కీలకమన్నారు. ప్రయివేటు రంగంలోని ఉపాధి, వ్యాపారాల్లోకి వెళ్లినా వ్యక్తిగత లాభంతోపాటు సమాజహితాన్నీ పట్టించుకోవాలన్నారు. అప్పుడే జీవితమంటే ఏమిటో సమగ్రంగా అర్థమై నిజమైన సుఖశాంతులతో బతకగలుగుతారన్నారు. ఎన్నికల్లో కుల, మత భావోద్రేకాలు, తాత్కాలిక తాయిలాలకు ఓటును అమ్ముకోకుండా సరైన నాయకులను ఎన్నుకోవాలని, 20-50 కోట్లు ఖర్చు పెట్టి గెలిచేవాడు నిజాయతీగా సేవల చేస్తాడని ఆశించటం భ్రమన్నారు. రాజకీయాలంటే, అసెంబ్లీ, లోక్‌సభకు ఎన్నికవటమే అని భావించవద్దన్నారు. ఎన్నికల లక్ష్యమైన పరిపాలనలో వార్డు స్థాయి నుండి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైవీయూ వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ, జేపీ నడుస్తున్న విశ్వవిద్యాలయమని, ఎందరికో స్ఫూర్తిప్రదాతని అన్నారు. ఇంఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఏప్రిల్ 2026

సంపుటి 27 సంచిక 04


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.


06 అధికార క్రీడలు - అనుకోని పరిణామాలు

08 ఉచితాలపై రాష్ట్రాలు 'గోల్డెన్ రూల్' పాటించాలి..

11 రాష్ట్రాల భవిష్యత్తు .. రాష్ట్రాల చేతుల్లోనే..

16 స్పీకర్ల వ్యవస్థను, మన చట్టసభల పనితీరుని మార్చుకోలేమా?


18 బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు - అంబేద్కర్ దార్శనికత

21 వికేంద్రీకరణకు పెద్దపీట వేసిన జస్టిస్ కురియన్ కమిటీ తొలి నివేదిక

28 మార్క్ టుల్లీ, రామారెడ్డిలకు లోక్ సత్తా ఘననివాళులు

33 రూర్బన్ పంచాయతీలు, చిన్న పట్టణాల అభివృద్ధితోనే నిజమైన జనాభా నిర్వహణ


### కార్టూన్ కార్నర్




మార్షల్స్ సార్! వాళ్ల సంఖ్య కూడా 50% పెంచమంటున్నారు!!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# పరిష్కారం దిశగా..పశ్చిమాసియా సంక్షోభం!

సంపాదకీయం

నలభై రోజుల పాటు ప్రపంచాన్ని తీవ్రంగా కలవర పరిచిన పశ్చిమాసియా సంక్షోభం పరిష్కారం దిశగా అడుగు పడటం ఒక సానుకూల పరిణామం. రెండువారాల పాటు కాల్పుల విరమణ పాటించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 7 సాయంత్రం ప్రకటించారు. అప్పటికే కొన్ని వారాలుగా ఇరాన్ పై తీవ్రమైన దాడి చేస్తానంటూ, ఇరాన్‌ను అంతం చేస్తానంటూ డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చారు. రెండు మూడు గడువు తేదీలు కూడా ఆయన ప్రకటించారు. ఏప్రిల్ 8వ తేదీ ఇరాన్‌కు తుది గడువు అంటూ ఆయన తీవ్ర హెచ్చరిక చేశారు.

"వేల సంవత్సరాల సంస్కృతి నేటి రాత్రితో అంతం అవుతుంది, తిరిగి నిర్మించడానికి వీలు లేనంతగా అది ధ్వంసం అవుతుంది. రాతి యుగపు ఆలోచనలతో ఉన్న ఇరాన్‌ను తిరిగి రాతియుగం లోకి పంపుతాం" అంటూ గడువు ముగియ డానికి కొన్ని గంటల ముందు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర హెచ్చరికలు అంతర్జాతీయ సమాజాన్ని నివ్వెర పరిచాయి. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ ఏమాత్రం ఖాతరు చేయలేదు. "తమపై జరిగే దాడిని దీటుగా ఎదుర్కొంటాం, దేశ ప్రజలందరు మానవహారంగా ఏర్పడి ప్రాణాలు అర్పించైనా సార్వభౌమత్వాన్ని రక్షించుకుంటారు, మా వైపు వేలుపెడితే దాన్ని నరుకుతాం" అంటూ ఇరాన్ స్పందించింది.

మొత్తం మీద ఆఖరు క్షణంలో వివేకం, విజ్ఞత మేల్కొన్నది. మధ్యవర్తుల సంప్రదింపులు ఫలించాయి. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రాతిపదిక ఏర్పడింది. కాల్పుల విరమణ గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ట్వీట్ తో ప్రపంచం ఊపిరి పీల్చుకున్నది. ఆయన చేసిన ట్వీట్, దానికి స్పందనగా ఇరాన్ తరపున వెలువడిన ప్రకటనల్లో బోలెడు సమాచారం దాగి ఉంది. ఇరుపక్షాల మనోగతం అందులో ఇమిడి ఉంది.

"పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌తో జరిగిన సంప్రదింపుల సందర్భంలో వారు చేసిన విజ్ఞప్తి మేరకు ఇరాన్ దేశం మీదకు ఈ రాత్రికి పంపదలచిన విధ్వంసకర బలగాలను నిలిపి వేస్తున్నాను". "హోర్ముజ్ జలసంధిని తక్షణమే, పూర్తిగా తెరవాలి, అందరికీ సురక్షితమైన ప్రయాణానికి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సమ్మతించే షరతుపై రెండు వారాలపాటు బాంబుల ప్రయోగాన్ని, దాడిని ఆపివేస్తున్నాను" అంటూ ట్రంప్ పేర్కొన్నారు.

తమ సైనిక లక్ష్యాలన్నీ సంపూర్ణంగా నెరవేరడమే కాదు, ఇరాన్‌తో దీర్ఘకాలిక శాంతి, మధ్య ప్రాచ్యంలో ప్రశాంతత సాధించే ఒక అర్థవంతమైన ఒప్పందం దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలు చాలా ముందుకు వెళ్ళాయి, ఈ విషయంలో తమ లక్ష్యాలను అధిగమించాం. అందుకే ఈ కాల్పుల విరమణ " అంటూ ట్రంప్ వివరించారు.

"ఇరాన్ నుండి 10 అంశాలతో కూడిన ఒక ప్రతిపాదన మాకు అందింది. చర్చలకు పనికొచ్చే ఒక ప్రాతిపదిక అందులో ఉందని నమ్ముతున్నాను. అమెరికా, ఇరాన్ దేశాలమధ్య ఉన్న గత కాలపు వివాదాల పరిష్కారానికి, అన్ని అం శాలపై తుది ఒప్పందానికి ఈ రెండువారాల వ్యవధి వినియోగపడుతుందని నమ్ముతున్నాను" అంటూ ట్రంప్ పేర్కొన్నారు.

ఇరాన్ కూడా చాలా జాగ్రత్తగా, ఆచితూచి స్పందించింది. "హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరచి ఉంచుతాం, అందులో ప్రయాణించే ట్యాంకర్లు, ఓడలు ఇరాన్ సైనికాధికారులతో సమన్వయం చేసుకోవాలి, ఈ సందర్భంలో ఇరాన్ ప్రాదేశిక సమగ్రతపై ఎలాంటి దాడి జరగరాదు, అప్పుడే రెండువారాల కాల్పుల విరమణ సవ్యంగా అమలు జరుగుతుంది" అంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగాచి పేర్కొన్నారు. "ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని తాజాగా దాడులు జరగని పక్షంలో తమ అన్నిరకాల సైనిక చర్యలను నిలిపి వేస్తాం, ఇది ఒక రాయితీ కాదు, తమ స్వీయ రక్షణకోసం తీసుకుంటున్న ఒక విరామం మాత్రమే" అంటూ అరగాచి పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా ఈ వైఖరిని ధృవీకరించింది.గత కొన్ని రోజులుగా సంప్రదింపుల్లో కీలక భూమిక పోషించిన పాకిస్తాన్ మొత్తం మీద ఇరు పక్షాలనూ ఒక వేదికపైకి తేవడంలో సఫలం అయ్యింది.

గల్ఫ్ సహకార సమితి దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులను ఖండిస్తూ భద్రతా సమితిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అత్యధిక దేశాలు మద్దతు ఇచ్చాయి. కానీ చైనా, రష్యా వీటో అధికారాన్ని ప్రయోగించాయి. ఏప్రిల్ 7, 8 తేదీల్లో జరిగిన భద్రతా సమితి సమావేశంలో "సైనిక బలగాలను వినియోగించి అయినా హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని" బహ్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానంపై విస్తృత చర్చ జరిగింది. దీనిపై జరిగిన ఓటింగ్ కు పాకిస్తాన్, కొలంబియా దేశాలు గైర్హాజరయ్యాయి. ప్రపంచంలో అత్యంత బలమైన మూడు శక్తులలో బలమైన రెండు అణ్వస్త్ర శక్తులు రష్యా, చైనా గట్టిగా ఇరాన్ కు అండగా నిలబడ్డాయి. ఇరాన్ కు అవసరమైన కీలకమైన సమాచారాన్ని , సాంకేతిక

సహకారాన్ని అందిస్తూ వచ్చాయి.

రెండురోజుల్లో ఇరాన్ కాళ్ళ బేరానికి వస్తుందని అమెరికా, ఇజ్రాయెల్ తొలుత భావించాయి. వెనిజులాలో జరిగినట్టు ఇరాన్‌లో కూడా ప్రభుత్వం వెంటనే మారిపోతుందని ట్రంప్ యంత్రాంగం అంచనా వేసింది. అందుకే ఆయన "రిజైమ్ చేంజ్" అనే మాట పదేపదే వినియోగించారు.యుద్ధంలో తన కీలక నేతలు పెద్ద సంఖ్యలో హతులైనా, కేంద్రీకృత నాయకత్వం లేకపోయినా, ఇరాన్ నలభై రోజుల పాటు నిలబడి పోరాడింది. తమ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత అసంతృప్తి ఉన్నా తమ దేశపు చావుబతుకుల పోరాటం కావడంతో ఇరానీయులు ఏకం అయ్యారు.

అమెరికా, ఇజ్రాయెల్ జమిలిగా మొదలుపెట్టిన ఈ యుద్ధానికి అమెరికాలో ఏకాభిప్రాయంలేదు. కాంగ్రెస్ ఆమోదం లేదు. తనది కాని యుద్ధంలో అమెరికా తల దూర్చిందన్న భావన దేశంలో ప్రబలంగా ఉంది. యుద్ధానికి వ్యతి రేకంగా కోటి మంది ప్రజలు రోడ్లెక్కారు. మరోపక్క కాంగ్రెస్‌లో ట్రంప్‌పై అభిశంసన తీర్మానం పెట్టడానికి డెమోక్రాటిక్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. ట్రంప్ ఆమోదయోగ్యత నానాటికీ తరిగిపోతున్నది. నవంబర్ చివరిలో సెనేట్‌కు, కాంగ్రెస్‌కు జరగనున్న ఉప ఎన్నికల్లో ఫలితాల గురించిన ఆందోళన కూడా రిపబ్లికన్స్‌లో పెరుగుతోంది. యుద్ధ వ్యూహంపై అధ్యక్షునికి సైనికాధికారులకు భిన్నాభిప్రాయాలు పొడచూపాయి. పలువురు అధికారులు ఉద్వాసనకు గురయ్యారు.ఇంటిలో పరిస్థితులు అనువుగా లేకపోగా, అంతర్జాతీయంగా కూడా అమెరికాకు ఆశించిన మద్దతు రాలేదు.

యుద్ధంలో దిగేముందు అమెరికా తమను సంప్రదించలేదని నాటో కూటమి సైనిక చర్యలకు దూరంగా ఉన్నది. యుద్ధంలో దిగిన తర్వాత హోర్ముజ్ జలసంధి పై ఇరాన్ పట్టును తప్పించడానికి తనకు సహకరించాలని ట్రంప్ పదేపదే చేసిన విజ్ఞప్తులకు నాటో దేశాల నేతలు ముఖం చాటు వేశారు. యుద్ధరంగంలో ఇరాన్ **43** యుద్ధవిమానాలను కోల్పోయినప్పటికీ అమెరికాకు చెందిన **46** యుద్ధ విమానాలను, ఇజ్రాయెల్‌కు చెందిన **18** యుద్ద విమానాలను ఇరాన్ కూల్చి వేసింది. ఇరాన్ ఆయుధ సామర్ధ్యాన్ని సరిగా అంచనా వేసుకోకుండా యుద్ధంలోకి దిగిన అమెరికా అనూహ్యంగా జరిగిన నష్టాలతో కంగు తిన్నది.

వాస్తవాలు గమనించిన ట్రంప్ ఇరాన్‌పై అణ్వాయుధ ప్రయోగం చేయవద్దని, చమురు, విద్యుత్, పౌర సదు పాయాలపై దాడులు చేయవద్దని ఇజ్రాయెల్‌ను హెచ్చరించగా, ఇరాన్‌పై అణ్వాయుధ దాడి చేస్తే ఇజ్రాయెల్ పై తాము అదే చర్యకు పూనుకుంటామని చైనా కూడా హెచ్చరించింది.ఇరాన్ లో యుద్ధ మృతుల సంఖ్య **3500** కాగా అందులో **1600** మంది పౌరులు ఉన్నారు. ఒక పాఠశాలపై జరిగిన బాంబు దాడిలో **172** మంది బాలికలు దుర్మరణానికి గురయ్యారు.

కచ్చితమైన అంకెలు లేకపోయినా అమెరికన్ సైనికుల మరణాలు కూడా ఎక్కువే నమోదు అయ్యాయి. వందలాది మంది గాయపడ్డారు. యుద్ధం సందర్భంగా అమెరికా పెట్టిన ఖర్చు **40** రోజుల్లో **44** బిలియన్ డాలర్లని అంచనా. తాజా పరిస్థితులను మదింపు వేసుకున్న తర్వాతనే అమెరికా కాల్పుల విరమణకు సిద్ధం అయ్యింది.చర్చలకు ప్రాతిపదికగా అమె రికా తొలుత ముందుకు తెచ్చిన **15** అంశాల ప్రతిపాదన వెనక్కుపోయింది. తాజాగా ఇరాన్ ముందుకు తెచ్చిన **10** అంశాల ప్రతిపాదనపై చర్చలకు అమెరికా ఆమోదం తెలిపింది. చర్చలు పూర్తి అయ్యేవరకూ హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యం కొనసాగుతుందని కూడా తేటతెల్లం అయ్యింది.

పశ్చిమాసియాలో శాశ్వత శాంతి, సుస్థిరత నెలకొనడానికి అంతర్జాతీయ చట్టాలను, ఐ.రా.స. తీర్మానాలను అమలు చేయడానికి అన్ని పక్షాలు కట్టుబడి ఉండటం గట్టి ప్రాతిపదిక అవుతుంది. బెంజామిన్ నెతన్యాహు కలలు కంటున్న "గ్రేటర్ ఇజ్రాయెల్" ఏర్పాటు, పాలస్తీనా దేశపు అస్తిత్వం వంటి సమస్యలకు పరిష్కారం అంతర్జాతీయ న్యాయసూత్రాల పరిధిలో, చట్టబద్ధ పాలనలోనే ఇమిడి ఉంది. సమస్యల పరిష్కారం ఉగ్రవాదంలో గానీ, సైనిక చర్యల్లో గానీ లేదని ఇప్పటికే స్పష్టం అయ్యింది.

ఇరాన్ అణు కార్యక్రమం , గల్ఫ్ ప్రాంతపు రక్షణా ఏర్పాట్లు, ఇరాన్ పై దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆర్థిక ఆంక్షల భవితవ్యం, ఇరాన్ ఆర్థిక వ్యవస్థ, ఇరాన్ విదేశీ సంబంధాలు వంటి అంశాలు చర్చల్లో ఎలాగూ ముందుకు వస్తాయి. తాజా యుద్ధం ప్రపంచాన్ని ఆర్థిక వినాశనం అంచుకు నెట్టింది. అపార జన నష్టం సంభవించింది. సహజ వనరుల, మౌలిక సదుపాయాల విధ్వంసం కోలుకోలేనంత స్థాయిలో జరిగింది.ఎట్టకేలకు సంక్షోభ పరిష్కారానికి ఒక దారి దొరికింది. ఈ అవకాశాన్ని అన్ని పక్షాలూ సద్వినియోగం చేసుకుంటాయని అంతర్జాతీయ సమాజం ఎదురు చూస్తున్నది.

డి. సోమసుందర్

# అధికార క్రీడలు - అనుకోని పరిణామాలు

## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



బలమైన దేశాల చర్యలు బలమైన ప్రభావం చూపుతాయి. చాలా సందర్భాల్లో అనుకోని పరిణామాలకు దారితీస్తాయి. రెండో ప్రపంచ యుద్ధం నాటికే సుసంపన్న దేశం అమెరికా. యుద్ధానంతర కాలంలో ప్రపంచశక్తిగా వ్యవహరించింది. గత ఎనిమిది దశాబ్దాలలో అంతర్జాతీయ వ్యవహారాలలో అమెరికా జోక్యంలేని పరిణామాలు తక్కువ. కొన్ని సందర్భాల్లో అమెరికా జోక్యం నిరపాయకరం. సానుకూల ప్రభావం కనబరిచి గణనీయ లాభం చేకూర్చాయి. ఉదాహరణకు, మార్షల్ ప్రణాళిక. యుద్ధంలో విధ్వంసానికి గురైన పశ్చిమ ఐరోపా పునర్నిర్మాణానికి ఈ ప్రణాళిక ఎంతగానో దోహదం చేసింది. దీని ద్వారా సుమారు 150-180 బిలియన్ డాలర్ల (ప్రస్తుత ధరల ప్రకారం) భారీ ఆర్థిక సహాయాన్ని అమెరికా అందించింది. అక్కడి దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఉద్దీపన అందించింది. కూటములను బలోపేతం చేసింది. వాణిజ్యాన్ని పెంపొందించింది. అనేక రకాలుగా ఐరోపా పునరుజ్జీవనానికి కారణమైన అమెరికా సాయం 'నాటో' కూటమికి దన్నుగా మారింది.

**జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ సైతం అమెరికా ఉదారత నుండి లాభపడ్డాయి.**

కానీ కమ్యూనిజాన్ని ఎదుర్కొనే క్రమంలో అమెరికా చేసిన కొన్ని దుస్సాహసాలు చేదు అనుభవాల్ని మిగిల్చాయి. ఇండో-చైనా ప్రాంతంలోని వియత్నాం, కంబోడియా, లావోస్‌లు భారీగా దెబ్బతిన్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో జోక్యం (1980-88), ఆఫ్ఘన్‌పై దండయాత్ర (2001), ఇరాక్‌పై యుద్ధం (2003) దారుణ పర్యవసానాలకు దారితీశాయి. ఆ దేశాల్లోని ప్రజలకు, మిగతా ప్రపంచానికి ఇప్పటికీ అవి పీడకలలు. తాలిబాన్ పెరగటానికి, అల్‌ఖైదా, ఐసిస్ ఆవిర్భావానికీ అమెరికా విధానాలు, జోక్యాలే ప్రత్యక్ష కారణమని నిస్సంశయంగా చెప్పొచ్చు.

ఫిబ్రవరి 28, 2026న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ప్రారంభించిన యుద్ధంపై భవిష్యత్తు చరిత్రకారులు ఎలాంటి తీర్పునిస్తారు? ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్-సయ్యద్ ఇరవని.. యుద్ధాన్ని వ్యతిరేకించేవారి వాదనల్ని నిక్కచ్చిగా వినిపించారు. సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాన్ని ఎలా ఉల్లంఘించారో తెలియచెప్పారు. ఒక రాయబారిగా, తన బాధ్యతల్లో భాగంగా ఆయన సరిగానే చెప్పారు. కానీ, ఇరాన్‌లోని మతశక్తుల ఆగడాల్ని, రెచ్చగొట్టే చర్యల్ని మాత్రం దాటవేశారు. తన దేశానికి అనుకూలమైన అంశాల్నే వాదించారు.

ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం.. ఏదైనా సైనిక దాడి లేదా దురాక్రమణ వంటి సమయాల్లోనే ఆత్మరక్షణ కోసం ఒక దేశం యుద్ధాన్ని ప్రకటించగలదు. లేదా శాశ్వత సభ్యులెవరూ వ్యతిరేకించకుంటే - సైనిక దాడికి భద్రతా మండలి అనుమతినిచ్చినప్పుడు మాత్రమే యుద్ధానికి దిగటం సాధ్యం. ప్రస్తుత ఇరాన్ యుద్ధం విషయంలో అటువంటి షరతులేవీ పాటించినట్లు కనిపించదు.

కానీ లోతుగా పరిశీలిస్తే, పరిస్థితుల్లోని సంక్లిష్టతలు వెల్లడవుతాయి. 1979లో ఇరాన్‌లో షాను గద్దె దించాక, అధికారాన్ని చేజిక్కించుకున్న మతతత్వ ప్రభుత్వం.. ఇజ్రాయెల్ ఉనికే లేకుండా చేస్తామని అధికారికంగా ప్రకటించింది. ఒకసారి కాదు.. మళ్లీమళ్లీ. 'ఇజ్రాయెల్‌కి మరణం', 'అమెరికాకి మరణం' అని శాపనార్థాలతోనే మతనేతల ప్రభుత్వం దశాబ్దాలపాటు వ్యవహరించింది. అణ్వస్త్రాల కోసం చురుగ్గా పావులు కదిపింది. ఇరాన్ శుద్ధిచేసిన యురేనియం స్థాయిల్ని చూస్తే.. పౌర అణు ఇంధనం కోసమని ఎవరూ అనుకోరు. అణ్వాయుధాల తయారీకి సరిపడా యురేనియాన్ని శుద్ధి గావించింది. ఇదేసమయంలో, నిత్యం బెదిరింపులు. రాజ్యవ్యవస్థలో భాగంకాని నాలుగు తీవ్రవాద, ఉగ్రవాద

బృందాల్ని తయారుచేసింది. హిజబుల్లా (లెబనాన్), హమాస్ (గాజా), హౌతీలు (యెమెన్), ముస్లిం బ్రదర్‌హుడ్ (ఇరాక్, సిరియా). ఇతర దేశాలకు ఇవి పక్కలో బల్లేల్లా తయారయ్యాయి. ఆ దేశాల భద్రతకు తీవ్ర ముప్పుగా మారాయి. మరోవంక, శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న సొంత పౌరుల మీదే నిర్దాక్షిణ్యంగా హింసకు పాల్పడింది. మాట వినని పౌరుల్ని ఉరితీయటం, కాల్చిపారేయటం మానవహక్కుల తీవ్ర ఉల్లంఘన. పైపైన చూసి అంచనా వేసేంత సజావుగా పరిస్థితి లేదు. జటిలమైన, గంభీరమైన పరిస్థితులు ఇరాన్‌లో నెలకొన్నాయి.

చట్టబద్ధ అంశాల్ని అలా ఉంచితే, అమెరికా-ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం ఇరాన్‌లో ఏ సమస్యలనైనా పరిష్కరించగలదా, లేక పరిస్థితిని ఇంకా సంక్లిష్టం చేస్తుందా?.. అనేది అసలైన, ఆచరణకు అవసరమైన ప్రశ్న. సమాధానాన్ని బహుశా రెండు భాగాలుగా చూడాలి.

ఇజ్రాయెల్‌కు, పొరుగున ఉన్న అరబ్ దేశాలకు ఇరాన్ నుండి పొంచివున్న ప్రమాదానికి సంబంధించి మొదటి కోణం.

ఇరాన్ క్షిపణుల మౌలిక వసతుల్ని బలహీనపరచటం, యురేనియం వసతుల్ని నాశనం చేయటం కొన్నేళ్లపాటు వారి సుస్థిరతకు భరోసా ఇవ్వొచ్చు. కానీ జూన్ 2025లో 12 రోజుల పాటు జరిగిన యుద్ధం ఇరానియన్ల అణ్వస్త్ర సదుపాయాలను ఇప్పటికే ధ్వంసం చేసింది. ఇప్పుడు బహుశా క్షిపణి సామర్థ్యాల్ని తీవ్రంగా బలహీనపరచవచ్చు. సాక్షాత్తూ ఒక రాజ్యవ్యవస్థే పెంచి పోషిస్తున్న ప్రచ్ఛన్న ఉగ్రవాద సంస్థలను గణనీయంగా దెబ్బతీయవచ్చు. కానీ ఆ రకంగా చూసినా.. పాతుకుపోయిన ఉగ్రమూక సంస్థలైన హమాస్, హిజబుల్లాలను ఇజ్రాయెల్ ఇప్పటికే నిర్వీర్యం చేసింది. కాబట్టి యుద్ధాన్ని దౌత్యం ద్వారా నిలువరించగలిగే అవకాశమైతే ఉంది.

బహుశా అత్యంత ముఖ్యమైన ప్రశ్న: సుదీర్ఘకాలంగా బాధితులుగా ఉన్న ఇరాన్ ప్రజలు ఈ యుద్ధం పర్యవసానంగా స్వేచ్ఛ, అభివృద్ధిని చవిచూడగలరా? ఇప్పుడున్న పరిస్థితుల్లో అటువంటి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉండటం విచారకరం. ఇరాన్‌లోని మతపాలన బలంగా, లోతుగా వేళ్లూనుకొని ఉంది. బహుశా ఎక్కువశాతం ప్రజలు మతతత్వ పాలన అంతమవ్వాలని కోరుకుంటుండొచ్చు. కానీ పాతుకుపోయిన, క్రూరమైన ఆ పాలనను కూలదోయటానికి ఆ ప్రజలకి ఒక సంస్థాగత వేదిక లేదు. అంత సాధనాసంపత్తీ లేదు.

ఇరాన్ ఒక సువిశాల దేశం. భారత్ విస్తీర్ణంలో సగం ఉంటుంది. భూతల యుద్ధానికి అమెరికా, ఇజ్రాయెల్ విముఖంగా ఉన్నాయి. ఆధిపత్య దేశాల దండయాత్రలు తరచూ వినాశకరంగా ముగుస్తుంటాయి. ఈ నేపథ్యంలో.. పొరుగు దేశాల కోణంలో ఇరాన్ పాలనా వ్యవస్థ బలహీనం కావొచ్చు. కానీ దేశీయంగా నియంత్రణ కోల్పోదు. లేదా అంతర్యుద్ధం, అరాచకత్వం, మూకుమ్మడి వలసలు ఉండొచ్చు. ఓ గొప్ప నాగరికతకు వారసులైన ఇరాన్ ప్రజలకు ఇదో వేదనాభరిత ఫలితమవుతుంది. కాబట్టి.. గల్ఫ్ దేశాల్లో ఎట్టకేలకు మొదలైన ఆధునికీకరణ, సెక్యులరీకరణ భారీగా దెబ్బతినటం, పెను విధ్వంసం, పశ్చిమాసియాలో అనిశ్చితి ఏర్పడటం తప్ప.. ఇరాన్ యుద్ధం వల్ల ఉపయోగం ఏముంది?

యుద్ధం వల్ల ప్రపంచ ఇంధన భద్రత సవాళ్లలో చిక్కుకుంది. ఈ ప్రాంతంలోని కోట్లాదిమంది పౌరుల, ప్రవాసుల రోజువారీ జీవితాల్లో అయోమయం నెలకొంది. జనజీవనంలోని కష్టాల ప్రభావం ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధాన్ని గనక దీర్ఘకాలంపాటు కొనసాగిస్తే,(తాత్కాలికంగా రెండు వారాలు విరామం ప్రకటించారు) పశ్చిమాసియా, మధ్యప్రాచ్యంతోపాటు.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఆ కారణంగానే, యుద్ధం నాలుగైదు వారాలు దాటి కొనసాగకపోవచ్చు. కానీ యుద్ధం ఎంత పరిమితమైనదైనా, నష్టం గణనీయంగానే ఉంటుంది. ప్రతికూలతల ప్రభావం దీర్ఘకాలంపాటు కొనసాగుతుంది.

**ఆపరేషన్ ఎజాక్స్ పాఠం**

ఇదేసమయంలో, ఆపరేషన్ ఎజాక్స్ దుస్సాహసం నుండీ పాఠం నేర్చుకోవటం అవసరం. జాతీయవాది, ఎంతో ప్రజాదరణగల ఇరాన్ ప్రధాని మోస్సాదిగ్‌ని 1953లో పదవీచ్యుతుడ్ని చేయటం ఓ ముందస్తు హెచ్చరిక. ఆంగ్లో-పర్షియన్ చమురు సంస్థ లాభాలు ఇరానియన్లకే దక్కాలని మోస్సాదిగ్ జాతీయాకరించటం బ్రిటన్‌కి అప్పట్లో ఆగ్రహం తెప్పించింది. విన్‌స్టన్ చర్చిల్, విదేశాంగ మంత్రి ఆంథోనీ ఈడెన్ నేతృత్వంలోని బ్రిటన్ ప్రభుత్వం ఒక తిరుగుబాటు ద్వారా మోస్సాదిగ్‌ను పదవీచ్యుతుడ్ని గావించే కుట్రపన్నింది. ఈ పన్నాగానికి అమెరికా మొదట సుముఖత వ్యక్తం చేయలేదు. కానీ ఐసెన్ హోవర్ అధ్యక్షుడయ్యాక ఒత్తిడికి తలొగ్గి పచ్చజెండా ఊపారు. తమ పట్టును పెంచుకొనేందుకు కాచుకున్న ఇరానియన్ మతవాదులకు ఇదో అవకాశంగా మారింది. పట్టు బిగించారు. మోస్సాదిక్‌ను గద్దె దించటంలో క్రియాశీల సహకారం అందించారు. ఇరాన్ షాకి ఇష్టంలేకపోయినా, సర్వాధికారి అయ్యేందుకు అవ కాశం కల్పించటంతో చివరికి ఒప్పుకున్నారు. మోస్సాదిగ్‌ను తొలగించి జైలుపాలు చేశారు. అధికారాన్ని షా తన చేతుల్లో కేంద్రీకరించుకున్నారు. దీంతో దేశంలో రాజకీయ శూన్యత ఏర్పడింది. ప్రజల్లో అశాంతి ఏర్పడటంతోనే, రాచరికం స్థానాన్ని మతపెద్దలు భర్తీ చేశారు. తాము అద్భుతంగా విజయవంతమయ్యామని బ్రిటన్, అమెరికా భావించాయి. కానీ చరిత్ర మరోలా రుజువు చేసింది. ఇక ఇప్పటి యుద్ధం గురించి రెండు దశాబ్దాల తర్వాత చరిత్ర తీర్పు ఎలా ఉండబోతోంది? ✧

## ఉచితాలపై రాష్ట్రాలు ‘గోల్డెన్ రూల్’ పాటించాలి..

# పిల్లల భవిష్యత్తుని దొంగిలించకుండా రాజ్యాంగ సంస్థకి బాధ్యతలు

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-

సంక్షేమం పేరుతో ఇచ్చే తాత్కాలిక వ్యక్తిగత తాయిలాల్ని మనం వాడుకభాషలో ‘ఉచితాలు’గా పిలుచుకుంటాం. వీటిపై 2026, ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. పోటాపోటీ ఉచితాలపై అంతకుముందు పలు సందర్భాల్లోనూ కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. తాజా విమర్శలు మాత్రం తీవ్రస్థాయిలో ఉన్నాయి. ఉమ్మడిగా వస్తువుల్ని, సేవల్ని, ఉత్పాదక సంక్షేమ పథకాలను అందించటం ప్రభుత్వ మౌలిక బాధ్యతల్లో భాగం. ఈ బాధ్యతల్ని పణంగా పెట్టి ప్రభుత్వం విచక్షణారహితంగా ప్రజాధనం పందేరాలు చేస్తోందని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. అప్పు తెచ్చిన డబ్బునీ అనుత్పాదకంగా వెచ్చించటాన్ని ప్రశ్నించింది. ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నా.. ప్రధాన న్యాయమూర్తి ఎక్కడా నిగ్రహాన్ని కోల్పోలేదు. తన పరిధి దాటకుండా విజ్ఞత పాటించారు. ‘ఒక సంక్షేమ పథకం ఎందుకిస్తున్నారు, ఏ రకంగా ఇవ్వాలి నిర్ణయించటం, వాటిపై వ్యాఖ్యానించటం మా పనికాదు’ అని స్పష్టం చేశారు. ఆ రీత్యా ప్రభుత్వానికి ఏ రకమైన ఆదేశం ఇవ్వలేదు. నియంత్రణ పాటించారు.

సీజేఐ ప్రమాణాలు ప్రశంసనీయం. న్యాయపరమైన అనుచిత జోక్యం లేకుండా నియంత్రణ పాటించటం, అందుకు తిరస్కరించటం.. రాజ్యాంగపరంగా పూర్తిగా సరైనవి. కోర్టు విశ్వసనీయతను పెంచేవి. అదేసమయంలో, మనలో చాలామంది మనసుల్లోని బాధకు అత్యున్నత న్యాయస్థానం గొంతునిచ్చింది. ఖజానా డబ్బుని దుర్వినియోగం చేయటం, అడ్డూఆపూలేని జనాకర్షక పథకాలను రాజకీయంగా మార్చటం, వీటికోసం ప్రభుత్వాలు తమ ప్రధాన బాధ్యతల్ని, పెట్టుబడుల విస్తరణను, ఆర్థికాభివృద్ధిని విస్మరించటం.. మనలో కాస్త ఆలోచించేవారిలోని అత్యధికుల మనసుల్ని తీవ్రంగా కలచివేస్తోంది, ఆవేదనకు గురిచేస్తోంది. సమస్యను నిష్పాక్షికంగా,పార్టీలకతీతమైన రీతిలో పరిశీలించి.. భవిష్యత్తుని పరిరక్షించటానికి, పరిణతితో కూడిన ఏకాభి ప్రాయానికి రావటానికి కోర్టు వ్యాఖ్యలు మనకో అవకాశాన్నిస్తాయి.

అదుపు తప్పిన తాత్కాలిక తాయిలాలు, ఎన్నికల హామీలు ‘ఈ రకమైన ఎన్నికల హామీలనే ఇవ్వండి’ అని రాజకీయ




పార్టీలను శాసించటం సరికాదు. దానివల్ల ఉపయోగం కూడా ఉండదు. కానీ ఒక గీత పాటించేలా చేయాలి. పార్టీలు కొన్ని సమయాల్లో ఆ హెచ్చరిక గీతను అతి క్రమిస్తున్నాయి. ఉచిత కలర్ టీవీలను ఇస్తామని 2006లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే ఇచ్చిన హామీ అటువంటిదే. ఆ వ్యవహారం సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. 2013లో ఎన్నికల సంఘానికి కోర్టు మార్గదర్శనం చేసింది. చట్టపరమైన నియంత్రణ ఏర్పాటు చేయనందున.. రాజ్యాంగంలోని 324 అధికరణాన్ని వినియోగించి ఎన్నికల హామీలపై ఒక నిబంధనావళిని తయారుచేయండని పేర్కొంది. గుర్తింపు పొందిన పార్టీలనూఈ ప్రక్రియలో భాగస్వాముల్ని చేయాలని సూచించింది. ఆయా పార్టీలన్నిటికీ నైతిక ప్రవర్తనా నియమావళిని వర్తింప చేయాలని కోరింది. అయితే, ఇంతవరకూ ఎన్నికల సంఘం అటువంటి చర్యలేవీ తీసుకోలేదు.

ఎలాంటి ఎన్నికల హామీలనిచ్చారు, ప్రజలకు, దేశానికి మేలు చేసేవేనా? అన్న వాటి స్వభావానికి సంబంధించిన చర్చను అలావుంచితే.. మౌలిక వసతుల కల్పన, ఆర్థికాభివృద్ధిని పెంపొందించటం, పేదలకు ఆదాయాన్ని పెంచటం మొదలైన తన మౌలిక బాధ్యతల్ని పణంగా పెట్టి అడ్డూఆపూలేని తాత్కాలిక జనాకర్షక తాయిలాల్ని ప్రభుత్వం ప్రకటించటం పలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి, ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోంది. ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకతను ఈ వ్యాస రచయితే అనేక సందర్భాల్లో సాక్ష్యాధారాలతో, హేతుబద్ధంగా,

సవివరంగా తెలియచేశారు.

### రాజ్యాంగ సాధనాలు, ఆర్థిక క్రమశిక్షణ

మరి ఇప్పుడు చేయగలిగిందేమిటి? రాజ్యాంగ నిర్మాతలు ఈ సమస్యను ఊహించారు. అందుకే భవిష్యత్తు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవటానికి కొన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్టికల్ 360 విస్పష్టంగా పేర్కొంటుంది – "భారతదేశం లేదా దేశంలోని ఏ భాగానికి సంబంధించైనా ఆర్థిక స్థిరత్వానికి లేదా పరపతికి విపత్తు ఏర్పడినప్పుడు ఆ విషయాన్ని ఒక తీర్మానం ద్వారా భారత రాష్ట్రపతి అధికారికంగా ప్రకటించవచ్చు. కానీ, అది ఒక పూర్తిస్థాయి సంక్షోభం ఏర్పడ్డాక, గత్యంతరం లేని తీవ్రస్థాయి చర్యగానే భావించాలి. భారతదేశ 'ఆర్థిక స్థిరత్వానికి', 'పరపతి'కి భరోసా ఇవ్వటం యూనియన్ ప్రభుత్వ బాధ్యత.




రాష్ట్రాలు ఆర్థిక సంక్షోభం బారిన పడకుండా చూడాల్సిన అధికారిక బాధ్యత ఆర్టికల్ 293 కింద జాతీయ స్థాయి ప్రభుత్వానికి ఉంది. యూనియన్ ప్రభుత్వం నేరుగా ఇచ్చిన లేదా గ్యారంటీ ఉన్న రుణం ఒక రాష్ట్రం బకాయి పడితే.. 'భారత ప్రభుత్వ అనుమతిలేకుండా ఆ రాష్ట్రం ఏ రకమైన రుణాన్ని తీసుకోవటం సాధ్యం కాకపోవచ్చు'. అటువంటి ఆమోద ముద్రకు 'తాను విధించదగిన' కొన్ని షరతుల్ని యూనియన్ విధించవచ్చు. అయితే, జాతీయ స్థాయిలోని ఏ ప్రభుత్వమూ ఇంతవరకూ ఆ బాధ్యతను ప్రదర్శించలేదు. రాజకీయంగా వ్యతిరేకత భయం కొంత, నిర్లక్ష్యం ఇంకొంత. పార్టీలపరమైన విపరీత విభజనలు.. ఇలాంటి వాతావరణంలో, రుణాల సేకరణకు అంగీకారాన్ని నిరాకరించటం లేదా షరతులు విధించటం కొన్ని సమస్యల్ని సృష్టించే అవకాశముంది. రాష్ట్రాల పట్ల యూనియన్ శత్రుత్వ ధోరణితో వ్యవహరిస్తోందన్నట్లుగా చిత్రీకరించవచ్చు. అంతకంటే దారుణ నిందారోపణల్నీ ప్రచారం చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఉదార మనస్తత్వంతో ప్రజలకు సంక్షేమాన్ని పెంచాలని ప్రయత్నిస్తుంటే.. యూనియన్ దురుద్దేశంతో అడ్డుకుంటోందని అమాయక ఓటర్లను రెచ్చగొట్టే అవకాశముంది. రాష్ట్రాల తరహాలోనే యూనియన్ ప్రభుత్వం కూడా రాజకీయ కార్యనిర్వాహక వ్యవస్థ. ప్రతి పార్టీ ప్రతి రాష్ట్రంలో తన ఓట్ల వాటాను వీలైనంత అత్యధికస్థాయికి పెంచుకోవాలనే కోరుకుంటుంది. కాబట్టి ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించేందుకు ఓటర్ల ఆగ్రహాన్ని చవిచూసేందుకు యూనియన్‌లోని పార్టీ కూడా సిద్ధపడదు.

### నిర్మాణాత్మక పరిష్కారానికి మార్గం

ఈ నేపథ్యంలో.. భవిష్యత్తుని పరిరక్షించుకోవటానికి దేశంలో మనకు ఒక నిర్మాణాత్మక చర్చ కావాలి. లేకుంటే, రాష్ట్రం తర్వాత రాష్ట్రం అప్పుల ఊబిలోకి జారిపోయే అవకాశం ఉంది. తిరిగి కోలుకోవటం కష్టమవుతుంది. చాలా రాష్ట్రాలు రోజువారీ ఖర్చు కోసం కూడా భారీ అప్పులు చేస్తున్నాయి. అది కూడా ఎటువంటి దీర్ఘకాలిక, ఉత్పాదక ఆస్తులు సృష్టించకుండా లేదా ప్రజల సంపాదనాశక్తిని పెంచకుండా. ఇది పిల్లల నుండి వారి భవిష్యత్తుని దొంగతనం చేయటమే. వారసత్వంగా పిల్లలకు ఎటువంటి ఆస్తులూ ఇవ్వకుండా, వారు తమ కష్టార్జితం నుండి చెల్లించే పన్నుల ద్వారా మన అప్పులు తీర్చాలనటం భారతీయ సమాజ నైతికతకు విరుద్ధం. దేశ భవిష్యత్తుకి విఘాతం.


మరెలా? ఈ జటిల సంకటం నుండి ఏ విధంగా బయట పడాలి? బహుశా మనం ఒక ప్రామాణిక సూత్రాన్ని (గోల్డెన్ రూల్) పాటించాలి. ప్రభుత్వాలు పెట్టుబడి అవసరాలకి మాత్రమే అప్పులు తేవాలి. రోజువారీ వినియోగానికి ఆ డబ్బు ఉపయోగించకూడదు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే రెవెన్యూలోటులో ఉన్నాయి. కానీ మన ఆర్థిక వ్యవస్థ 7% చొప్పున పెరుగుతోంది. ప్రస్తుత ధరలసూచీ ప్రకారం (నామినల్) వృద్ధి దీర్ఘకాలంలో 10% దాకా ఉండవచ్చు. ప్రభుత్వ ఆదాయాలు కూడా అదే రేటుతో పెరుగుతాయి. మనం చేయవలసిందల్లా – రోజువారీ ఖర్చులో లోటు (రెవెన్యూ లోటు) శూన్యం అయ్యేంతవరకూ ఆ వ్యయాన్ని పెరగకుండా స్తంభింపచేయటం. మరీ తప్పదు అనుకుంటే,

ఏడాదికి ఓ 2-3% వరకూ ఖర్చు అనుమతించవచ్చు. అంతకంటే ఎట్టిపరిస్థితుల్లోనూ పెరగకుండా చూసుకోవాలి. అప్పుడు కొన్నేళ్ల వ్యవధిలో అప్పు నియంత్రణలోకి వస్తుంది; ఆర్థిక నిర్వహణ ఆరోగ్యకరంగా మారుతుంది. ఇందుకోసం, ప్రతి రాష్ట్రానికీ అక్కడి ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా ఒక మార్గసూచీని అందించవచ్చు. నిర్దిష్ట కాలపరిమితిలో రెవెన్యూలోటును శూన్యం చేస్తేనే ఏ రకమైన కొత్త అప్పు తీసుకోవటానికైనా అనుమతినిస్తామని షరతు విధించాలి. ఇందుకోసం 293 (4) అధికరణాన్ని ఉపయోగించాలి.

**'కాగ్' పాత్ర .. పార్టీలకతీతంగా అమలు**

పార్టీల ప్రమేయం లేకుండా అటువంటి షరతును మనం ఎలా అమలు చేయగలం? కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విశ్వసనీయ రాజ్యాంగ సంస్థ. రాష్ట్రాల ఆదాయ వ్యయాలను ఎప్పటికప్పుడు (రియల్ టైమ్‌లో) పర్యవేక్షించటం; బడ్జెట్‌లో చూపని రుణాలు, బకాయిలు పెండింగ్ లో ఉన్న బిల్లులు వగైరాలు సహా పద్దుల నిర్వహణ పారదర్శకంగా జరిగేలా చూడటం బాధ్యతల్ని కాగ్‌కి అప్పగించవచ్చు. రుణం తీసుకోవటానికి ఆమోదం లేదా తిరస్కారం కాగ్ సిఫార్సును బట్టే నిర్ణయించాలి. పారదర్శక డేటాను, సాక్ష్యాధారాలను పరిశీలించి ఆమోదముద్ర వేయాలి.

కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే సంక్షోభం అంచున ఉన్నాయి. అటువంటి పరిస్థితిని నివారించేందుకు రాజ్యాంగం మనకు




అవసరమైన సాధన సంపత్తినిచ్చింది. ద్రవ్య నిబంధనలను అమలుచేయటానికి ఆచరణసాధ్యమైన పద్ధతులున్నాయి. మిగతా వాటితో పోలిస్తే అవి అంత కష్టమైనవి కూడా కాదు. పారదర్శకంగా, విశ్వసనీయమైన, పార్టీలకతీతమైన రీతిలో ఆ నిబంధనలను అమలు చేయవచ్చు. ఇది తక్షణం జరగాల్సిన పని. కాలం కూడా అనుకూలంగా ఉంది. ఉచితాలు, దుబారా వల్ల డబ్బు ఖర్చు కనిపిస్తోందిగానీ.. తమ జీవితాల్లో ఆశించినస్థాయి మార్పులేమీ రావటంలేదని ప్రజల్లో ఎక్కువ మంది భావిస్తున్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మనం కార్యాచరణ ప్రారంభించాలి. తేలిగ్గా తీసుకున్నా, విఫలమైనా.. మన జాతి జీవనంలోని ఒక కీలక కూడలిలో భారతదేశ అభివృద్ధి అవకాశాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ✧

## ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా సోమసుందర్





ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్(ఐజేయూ) సెక్రటరీ జనరల్‌గా జనబలం వర్కింగ్ ఎడిటర్ డి.సోమసుందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 27,28,29 తేదీల్లో ఐజేయు జాతీయ 11 ప్లీనరీ విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగాయి. ప్లీనరీ ముగింపు సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా బల్విందర్ సింగ్ జమ్మూ(పంజాబ్) ఎన్నికయ్యారు. గతంలోనే వీరు ఎన్నికైనా ప్లీనరీ వేదికపై బాధ్యతలు చేపట్టారు. మార్చి 29న ఎన్నికలను నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఉపాధ్యక్షుడిగా వై.నరేందర్‌రెడ్డి (తెలంగాణ), కార్యవర్గ సభ్యులుగా కె. సత్యనారాయణ, కె.అజిత(తెలంగాణ), కూన అజయ్‌బాబు, ఈఎస్ రాజు(ఆంధ్రప్రదేశ్) నుంచి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగునుంది. సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన డి. సోమసుందర్ రెండు దశాబ్దాలకు పైగా జనబలం వర్కింగ్ ఎడిటర్‌గా కొనసాగుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమసుందర్ ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, డా. నిమ్మల రామానాయుడు, ఎంపీలు లావు కృష్ణ దేవరాయలు, కలిసెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు వై.సత్యనారాయణ(సుజనా చౌదరి), బొండా ఉమా, డా.కే.మురళీ మోహన్, విజయడైరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్లీనరీలో సందేశాలు ఇచ్చారు. 19 రాష్ట్రాలకు చెందిన 350 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మీడియా స్థితిగతులపై ప్రతినిధులు చర్చించారు. పది తీర్మానాలను ఆమోదించారు.

# రాష్ట్రాల భవిష్యత్తు .. రాష్ట్రాల చేతుల్లోనే..

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్




ఏప్రిల్ 2026 నుండి పదహారవ ఆర్థిక సంఘం నివేదిక అమల్లోకి రానుంది. 2031, మార్చి 31 వరకు కమిటీ సిఫార్సులకనుగుణంగా జాతీయ స్థాయి, రాష్ట్రాల మధ్య నిధుల పంపిణీ ఉంటుంది. ఎఫ్.సి నివేదిక అంశాలపై ఇటీవల హైదరాబాద్‌లో మేధోమథన సదస్సు జరిగింది. తెలంగాణ ఆర్థిక శాఖ, సామాజిక, ఆర్థికాంశాల అధ్యయన కమిటీ (సెస్) నిర్వహించాయి.

కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, రాష్ట్రాలు తమ పరిధిలోని అంశాలను చక్కదిద్దుకోవటం, సమర్థంగా వ్యవహరించటం మీదే దేశ ఆర్థికాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ముఖ్యంగా సంక్షేమం పేరుతో ఆకర్షణీయంగా ఉండే తాత్కాలిక పథ కాలు అధికమై, ఆస్తులు సృష్టించే పెట్టుబడులు తగ్గిపోతున్నాయన్నారు. చాలా రాష్ట్రాల్లో ఈ పరిస్థితి వల్ల దేశ సుస్థిరాభివృద్ధికి భంగం వాటిల్లుతోందన్నారు. యూనియన్ ప్రభుత్వంతోపాటు.. ఒడిశా, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాలు స్తోమతుకు తగ్గట్లు సంక్షేమాన్ని అమలు చేస్తూనే, రెవెన్యూ మిగులు చూపిస్తున్నాయన్నారు. తెలుగునాట సహా చాలా రాష్ట్రాలకు మద్యం అమ్మకాలే ప్రధాన ఆదాయవనరని, మద్యనిషేధం విధించి కూడా గుజరాత్ అభివృద్ధిని, మిగులు ఆదాయాన్ని కనబరుస్తోందన్నారు. పదహారవ ఆర్థిక సంఘం సిఫార్సులు పరిణతితో ఉన్నాయన్నారు. ఎక్కువ ఆదాయాన్ని యూనియన్‌కు జమ చేస్తున్న రాష్ట్రాలకు జీడీపీలో పది శాతం అదనపు పాయింట్లు (వెయిటేజి) ఇవ్వటం సరైన దిశలో ప్రోత్సాహమన్నారు.

ఈవేళ ఒక రాష్ట్ర భవిష్యత్తు ఆ రాష్ట్రంలోనే, అక్కడి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందని జేపీ అన్నారు. ఫెడరలిజం మూడో అంచెలోని స్థానిక ప్రభుత్వాలకు విస్తరించాల్సి ఉంది తప్ప, రాష్ట్రాల వరకు సమస్య లేదన్నారు. కొన్ని రాష్ట్రాలు అప్పులు చేసి మరీ తాత్కాలిక తాయిలాల్ని, నగదు బదిలీల్ని చేస్తున్నాయని, ఇది పిల్లల భవిష్యత్తును దొంగతనం చేయటమేనన్నారు. మన భారతీయ సంస్కృతికీ ఈ ధోరణి విరుద్ధమన్నారు. మరోవంక, సమ్మిళిత అభివృద్ధికి కీలకమైన కొన్ని మౌలిక రంగాల్లో ఖర్చు చేస్తున్నా, ఫలితాలు రావటం లేదన్నారు. ముఖ్యంగా పాఠశాల చదువులో ఒక్కో విద్యార్థి మీద ఏడాదికి రెండు తెలుగు రాష్ట్రాలూ రూ. 1,10,000 దాకా ఖర్చు చేస్తున్నా.. పాస్‌లు, ర్యాంకులు తప్ప తరగతికి తగిన పరిజ్ఞానం సగం

మందికి కూడా లేదన్నారు. పదహారేళ్ల వయసులో గడియారం చూసి సరిగా సమయం చెప్పటం కేవలం యాభై శాతం విద్యార్థులే చేయగలుగుతున్నారన్నారు. మార్కెట్‌లో ఒక వస్తువుపై డిసౌంట్‌ను గణించి ధరను కచ్చితంగా చెప్పగలిగేవారి సంఖ్య అంతకంటే తక్కువగా ఉందన్నారు. వారంతా ఎలా పాసవుతున్నారో ప్రభుత్వమే చెప్పాలన్నారు.

సంక్షేమ పథకాల్లో పనికొచ్చేవి ఏ మేరకు ఉన్నాయన్న సంగతి అలా వుంచితే, ఉత్పాదక రంగాల్లో పెట్టే ఖర్చు కూడా దోపిడీ పద్ధతిలో ఉందని జేపీ పేర్కొన్నారు. తక్కువ వ్యయంతో ఎక్కువ ఫలితం వచ్చేలా ప్రజలకు సాగునీరు, మౌలిక సదుపాయాలు అందించే అవకాశాలున్నా.. ప్రాజెక్టుల పేరుతో పొలాలకు నీరు బదులు నాయకులకి డబ్బు పారుతోందన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనిరీతిలో భారత్‌లో 60% జీడీపీ రాష్ట్రాల స్థాయిలోనే ఖర్చవుతోందన్నారు. ఈ నేపథ్యంలో.. ప్రతి రూపాయి ప్రజాధనం సద్వినియోగం గావించేలా పాలనా సామర్థ్యాలను పెంచుకోవటం, ప్రజల సంపాదనా శక్తిని పెంచటం రాష్ట్రాల లక్ష్యం కావాలన్నారు. రాష్ట్రాల భవిష్యత్తు రాష్ట్రాల చేతుల్లోనే ఉండే పరిణామం భవిష్యత్తులో ఇంకా ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు.

రాష్ట్రాలు బాధ్యతారాహిత్యంగా పందేరాలు, దుబారా ఖర్చులు చేసి అప్పుల్లో కూరుకుపోతే, మన రాజ్యాంగం ప్రకారం జాతీయ స్థాయి ప్రభుత్వం దివాళా తీస్తుందని, చాలా ముందుచూపుతో మన పెద్దలు ఈ ఏర్పాటు చేశారని గుర్తించాలని జేపీ తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి మధ్య రాష్ట్రాలు సమతూకం పాటించటంతోపాటు.. స్థానిక ప్రభుత్వాలకు కనీసం సగం డబ్బు చట్టబద్ధంగా కేటాయించి జవాబుదారీతనం వరకు పరిమితం కావాలన్నారు. చైనా లాంటి నిరంకుశ దేశం కూడా ఆర్థికంగా గొప్ప విజయాలను సాధించగలగటంలో జీడీపీలో 51% నిధులు స్థానిక ప్రభుత్వాల ద్వారా ఖర్చు చేయటమనే ప్రజాస్వామిక విధానం ఎంతో కీలక పాత్ర పోషించిందన్నారు. ఇంకా నిధుల కోసం యూనియన్‌ను డిమాండ్ చేయటం కన్నా.. ఇప్పటికే ఉన్న నిధుల్ని నాణ్యమైన విద్య, ఆరోగ్యం తదితర రంగాల్లో సద్వినియోగం గావించటం, ఆర్థిక క్రమశిక్షణ పాటించటం, స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయటం, గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి పెట్టుబడుల్ని ప్రోత్సహించటం, వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూనే ఆ రంగం మీద ఆధారపడినవారిలో ఎక్కువశాతానికి చిన్న పట్టణాల్లో తయారీరంగంలో ఉపాధిని కల్పించి వలసల్ని హేతుబద్ధీకరించటం, పోలీస్ స్టేషన్లు సహా అన్ని చోట్లా పౌర సేవల్ని సేవాభావంతో అందించే ఏర్పాట్లు, చౌకగా, త్వరగా న్యాయం కోసం స్థానిక కోర్టులు (గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా) మొదలైన చర్యల్ని వేగంగా చేపట్టాలన్నారు. ఇవి చేయకుండా ఎవరూ ఓ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈవేళ అడ్డుకోలేరని.. రాష్ట్రంలోపల రాజకీయ సంకల్పం, అవగాహనే సమస్యన్నారు. వీటితోపాటు వేగంగా ఆర్థికాభివృద్ధికి అవకాశాలున్నందున.. ఎంత వెనుకబడిన రాష్ట్రమైనా కొద్దికాలంలోనే కోలుకోగలదన్నారు. రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించేలా యూనియన్ ప్రభుత్వం ఆర్టికల్ 293ని అమలు చేసే బాధ్యతను సవ్యంగా నెరవేర్చాలని జేపీ సూచించారు.

### ప్రభుత్వోద్యోగుల జీతాల్ని ఇక నుండి పరిమితంగానే పెంచండి

తెలంగాణలో సీనియర్ స్వీపర్‌కి అన్ని రకాల భత్యాలూ కలిపి నెలకు రూ.2 లక్షల దాకా జీతం వస్తోందని, ఇది కొందరు ఐఏఎస్ అధికారులకంటే కూడా ఎక్కువని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై సదస్సు అనంతరం జేపీ యూట్యూబ్ ఛానల్‌లో స్పందించారు. ఈ చర్చ జరగటం మంచిదన్నారు. రాజకీయ నేతల్లో నిజాయతీపరులు, సమర్థులు అన్ని పార్టీల్లో ఉన్నట్లే.. ప్రభుత్వోద్యోగుల్లో అద్భుతమైనవారు ఇప్పటికీ ఉన్నారని, అయితే వ్యవస్థగా ప్రజాసేవకులుగా పనిచేయటం లేదన్నారు. రాష్ట్ర విభజన జరిగాక, రెండు తెలుగు రాష్ట్రాలూ తమ సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు, పోటాపోటీగా ప్రభుత్వోద్యోగుల జీతాలు 43-45% పెంచారన్నారు. దీనివల్లే తెలంగాణలో అంతకుముందు నెలకు రూ.1420 కోట్లు ఉండే జీతాలు, ఇప్పుడు ఏడాదికి రూ.72,000 కోట్లకు పెరిగాయన్నారు. తనకు ప్రభుత్వోద్యోగులంటే వ్యతిరేకత లేదని, తానూ ప్రభుత్వంలో పనిచేశానని గుర్తుచేశారు. కానీ దిగువ స్థాయి ఉద్యోగికి నెలకు రూ. 1-2 లక్షలు, ఇంజినీర్‌కి రూ.7 లక్షలు వంటి జీతాలు సరికాదన్నారు. ఒకసారి ఇచ్చిన జీతాన్ని వెనక్కి తీసుకోవటం కష్టం కాబట్టి.. ఇక ముందు రాష్ట్ర అభివృద్ధి శాతం కంటే ఎక్కువగా జీతాలు పెంచే పద్ధతికి స్వస్తి చెప్పి, స్వల్పంగా, 3-4% దాకా పెంచే ఏర్పాట్లు చేయాలని జేపీ సూచించారు.

రాష్ట్రాలు సొంత పన్నుల ఆదాయాన్ని పెంచుకోవాలి

స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్రం సలహా ఇస్తున్నట్లే, రాష్ట్ర ప్రభుత్వం కూడా సొంత పన్నుల ఆదాయాల్ని పెంచుకోవాలని ప్రణాళికా సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ ఆహ్లువాలియా సెస్ సదస్సులో సూచించారు. రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలపై పునస్సమీక్షించి రాష్ట్రాలకు బదిలీ చేయటంపై ఆలోచించాలన్నారు. అదేవిధంగా, రాష్ట్రాలు-స్థానిక

ప్రభుత్వాల మధ్య అధికారాల విభజనపై చర్చ జరగాలన్నారు. స్థానిక సంస్థలకు వచ్చిన ఆదాయంతోనే పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఆర్థికసంఘాన్ని ప్రారంభంలో దేశ రాజకీయ, ఆర్థిక అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేశారని, అప్పటి నిబంధనలు ఇప్పటి అవసరాలకు ఏమేరకు సరిపోతాయో సమీక్షించాలన్నారు.

**మన సమాఖ్య వ్యవస్థ గొప్ప సక్సెస్**

అనేక ఒడిదుడుకులను తట్టుకుని మన సమాఖ్య వ్యవస్థ బలంగా రూపుదిద్దుకోవటం గణనీయ విజయమని, ప్రపంచ ప్రజాస్వామ్యంలో గొప్ప నమూనా అని రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. రాష్ట్రాల ఆర్థిక వనరులు, సద్వినియోగం ఇప్పుడు ప్రధాన చర్చ అన్నారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీపై విభేదాలున్నా, 16వ ఆర్థిక సంఘం రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తికి అనుగుణంగా ఒక పాఠ్యపుస్తకం తరహాలో సిఫార్సుల్ని చేసిందన్నారు. 2047కి భారత్ నిర్దేశించుకున్న లక్ష్యం చాలా విస్తృతమైనది, సంక్లిష్టమైనది, కష్టసాధ్యమైనది అని దువ్వూరి వ్యాఖ్యానించారు.

విద్యుత్ సంస్థల అప్పులపై ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల వల్ల తెలంగాణ ఎలా ఒడిదుడుకుల్లో చిక్కుకుందో అంతకుముందు ఆర్థికశాఖ కార్యదర్శిగా కూడా పనిచేసిన అనుభవంతో రామ కృష్ణారావు వివరించారు. పన్నుల్లో రాష్ట్రాల వాటా బదిలీ తరహాలోనే కేంద్ర గ్రాంట్‌లు కేటాయించటంలో కూడా ఒక ఫార్ములా అవసరమన్నారు.ఆర్.బీ.ఐ డైరెక్టర్ అత్రి, 15వ ఆర్థిక సంఘం సభ్యుడు ఎ.ఎన్ ఝా, సెస్ డైరెక్టర్ రేవతి, మాజీ ఐఏఎస్ పీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ✦

## టీచర్లు, బోధనేతర సిబ్బంది జీతాలు మరీ ఎక్కువగా ఉన్నాయి

తెలంగాణలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది జీతాలు ఎక్కువగా ఉన్నాయని విద్యాకమిషన్ అభిప్రాయ పడింది. భవిష్యత్తులో చేరేవారికి జీతాల్ని హేతుబద్ధీ కరించాలని సూచించింది. టీచర్ల సేవలు విద్యా నాణ్యత పెరగటానికి, విద్యార్థుల సంక్షేమానికి అని ఉపయోగ పడాలని పేర్కొంది. ఈ లక్ష్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని విద్యారంగం సహా ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల వ్యయంలో సమతుల్యత పాటించాలని సూచించింది. జీతభత్యాలు, పెన్షన్ల వ్యయాన్ని నియంత్రించని పక్షంలో భవిష్యత్తులో విద్యను బలోపేతం చేయటం కష్టమని స్పష్టం చేసింది. పదిహేను కిలోమీటర్ల విస్తీర్ణంలో పాఠశాల అందుబాటులో ఉండే ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. జవాబుపత్రాన్ని ఇద్దరు అధ్యాపకులతో మూల్యాం కనం గావించాలని, తేడా 9 మార్కులకు మించితే మూడో సారి మరో అధ్యపకునితో మూల్యాంకనం చేయించాలని సూచించింది. మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి నేతృత్వం లోని కమిషన్ మొత్తం 434 సిఫార్సుల్ని ఇచ్చింది. ఇందులో జీతాల సిఫార్సు పట్ల ఉపాధ్యాయ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐఏఎస్‌కి తర్కం, నైతిక విలువలు పరీక్షపై గతంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంటులో జరిగిన చర్చ, ఓ జాతీయ ఛానల్‌లో విద్యాప్రమాణాలపై మంత్రి, ప్రజాప్రతినిధుల చర్చ విద్యారంగాన్ని ఎంత భ్రష్టు పట్టించేలా ఉన్నాయో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవ స్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెప్పే ఉదాహరణల్ని గుర్తుచేసేలా యూనియన్ మంత్రి హోదాలో ఉన్న ఒక నాయకుడు స్పందించారు. పాస్ మార్కులను 35 నుండి 45కి పెంచితే పేద విద్యార్థులు ఎలా పాస్ అవుతారని సదరు మంత్రి ఆవేశంగా ప్రశ్నించారు. అసలు విద్య గురించి మన రాజకీయంలో, ఎన్నికల ప్రచారంలో, చట్టసభల్లో చాలా తక్కువ. అలాంటిది ఆ కాస్త చర్చను కూడా పిల్లలకు పనికిమాలిన చదువుల్ని అందించేరీతిలో చేయటం బాధాకరం.

విద్యారంగం ఉన్నది పిల్లలకు నాణ్యమైన చదువు అంది వారి బుద్ధి వికసించటానికి, ప్రపంచంలో ఎక్కడికెళ్లయినా బతకగలిగే నైపుణ్యాల్ని అందించటానికా? లేక ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్, వారి జీతభత్యాల కోసమా? అనే నిజాయతీని అంతకు ముందు గురుకుల పాఠశాలల వ్యవస్థ నిర్వ హణలో ఉత్తమ ఫలితాలు సాధించి, ఇప్పుడు రాజకీయ నాయకుడైన ఓ ఐపీఎస్ అధికారి కూడా ప్రదర్శించక పోవటం శోచనీయం. విద్యాకమిషన్ నివేదికలో అన్ని సిఫార్సులూ బాగున్నాయని, సమగ్రమని ఎవరూ చెప్పటం లేదు. కానీ ప్రభుత్వ ఉపాధ్యా యుల జీతాలు మిగతా సమాజంతో, బాగా చదువు చెబు తున్నాయని పేరున్న ప్రయివేటు పాఠశాలలతో పోలిస్తే కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. అయినా సర్కారీ బడుల్లో పిల్లలకు చదువు రావటంలేదు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లల సంఖ్య ఉన్నకొద్దీ తగ్గిపోతుండగా, వాటిలో సగం సంఖ్యలో కూడా లేని ప్రయివేటు స్కూళ్లలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది.. మొదలైన వాస్తవాల్ని విమర్శించటం ద్వారా మనం సమాజానికి, భవిష్యత్తు తరాలకి మంచి చేస్తున్నామా? ✦

# కాగ్ నివేదిక .. ఏపీ ప్రభుత్వ వివరణ

ఆంధ్రప్రదేశ్ సంక్షేమం పేరుతో ఇస్తున్న తాత్కాలిక వ్యక్తిగత తాయిలాల వల్ల ఎలా ఆర్థిక ఒడిదుడుకుల్లో కొట్టుమిట్టాడుతోందో, మూలధన వ్యయ కేటాయింపుల్నీ రోజువారీ ఖర్చులకు ఎలా మళ్లిస్తోందో, బడ్జెట్ ఖర్చు ప్రతిపాదన-సవరించిన అంచనాల అంతరం ఏరీతిలో కొనసాగుతోందో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక వెల్లడించింది. కాగ్ 2024-25 ఆర్థిక సంవత్సర నివేదికను ఇటీవలి బడ్జెట్ సమావేశాల్లో ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది.

ఏపీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,69,928 కోట్ల బడ్జెట్ ఖర్చును ప్రతిపాదించింది. కానీ వాస్తవంగా రూ.2,49,191 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. పన్నుల రాబడి రూ.1,41,515 కోట్లు, నికర రుణాలు రూ.78,098 కోట్లు, యూనియన్ ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం రూ.20,188 కోట్లు, పన్నేతర రాబడి రూ.5,972 కోట్లు, మూలధన వసూళ్ల ద్వారా రూ.349 కోట్లు, రుణాల అడ్వాన్సుల రికవరీ వల్ల రూ.96 కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి. రెవెన్యూలోటును రూ.60,285 కోట్లుగా, ద్రవ్యలోటును రూ.81,971 కోట్లుగా కాగ్ లెక్కించింది.

**303 రోజులు చేబదుళ్లు**




2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రిజర్వుబ్యాంకు కల్పించిన ప్రత్యేక సదుపాయాలను వినియోగించుకుంది. ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయాన్ని 71 రోజులపాటు ఉపయోగించుకొని రూ.42,004 కోట్లు తీసుకుంది. ఈ మొత్తంపై రూ.188.92 కోట్ల వడ్డీ చెల్లించింది. ముప్పై రెండు రోజులపాటు రాష్ట్రం ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉంది. రూ.56,631 కోట్లు ఆ రూపంలో వినియోగించుకుని తిరిగి చెల్లించింది. ఇందుకు రూ.32 కోట్లు వడ్డీ భరించింది.

⏭ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,31,633 కోట్ల పన్నుల రాబడి సాధించగా, 2024-25లో రూ.1,14,515 కోట్లు సమీకరించింది.

⏭ యూనియన్ ప్రభుత్వం నుండి రూ.20,188 కోట్ల సాయం అందింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.14,907 కోట్లు, ఆర్థిక సంఘం గ్రాంట్ల రూపంలో




రూ.4,737 కోట్లు, ఇతర గ్రాంట్లు రూ.642 కోట్లు వచ్చాయి.

⏭ రాష్ట్ర సొంత రాబడి రూ.89,435 కోట్లుగా లెక్కించారు.

⏭ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.21,173 కోట్లు మూలధన వ్యయంగా లెక్కించారు. రాష్ట్రం అప్పు తీసుకున్న మొత్తంలో ఇది 24% కావటం గమనార్హం.

**ప్రభుత్వ వివరణ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి కాగ్ నివేదికను ఉటంకిస్తూ మార్చి, 2026లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు ప్రకటనలు విడుదల చేసింది. ఏపీలో 2023-24తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో సొంతపన్ను ఆదాయం 4.1% పెరిగిందని తెలిపింది. కేంద్ర పన్నుల వాటాలోనూ 13.9% వృద్ధిని నమోదు చేసినట్లు వివరించింది. మొత్తం పన్ను ఆదాయం (సొంత పన్నులు, యూనియన్ వాటా కలిపి) రూ.1,31,633 కోట్లు నుంచి రూ.1,41,515 కోట్లకు పెరిగిందని, 7.5% వృద్ధి సాధించటమే మెరుగైన పన్నులు, ఆర్థిక పరిస్థితి పునరుద్ధరణకు సంకేతమని పేర్కొంది. పన్ను రేట్లు పెంచకుండానే రాబడి పెరగటం ఆర్థిక వ్యవస్థ క్రమశిక్షణకు నిదర్శనమని వెల్లడించింది.

⏭ గత ప్రభుత్వంలో వచ్చిన అసాధారణ గ్రాంట్లు ఈసారి వచ్చే అవకాశం లేకపోవటంతో రెవెన్యూ రాబడులు తగ్గాయి. 2014-15 నాటి రూ.10,460 కోట్ల రెవెన్యూలోటు గ్రాంటు (లోక్‌సత్తా చొరవతో ఏర్పాటైన తెలుగు, తెలుగేతర స్వతంత్ర నిపుణుల బృందం సిఫార్సును అనుసరించి) 2023-24లో వచ్చింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన రెవెన్యూగ్రాంట్లు మొదటి మూడేళ్లలోనే, అంటే 2021-22 నుంచి 2023-24 మధ్య ముందుగానే

రాష్ట్రానికి వచ్చాయి. వాటిని మినహాయించి చూస్తే, గత ప్రభుత్వ హయాంలో రాబడి రూ.1,60,616 కోట్లు మాత్రమే. 2024-25లో ఆదాయం రూ.1,67,675 కోట్లుగా ఉంది. అంటే, 4.4% ఎక్కువే.

అధికవడ్డీల భారం రూ.29,481 కోట్ల నుంచి రూ.32,967 కోట్లకు

⏭ 2024-25లో రుణాలు, అడ్వాన్సులతో కలిపి రూ.21,173 కోట్ల మూలధన వ్యయం చేశాం.

⏭ గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ప్రస్తుత ప్రభుత్వంపై వడ్డీల భారం పెరిగింది. 2023-24లో వడ్డీ చెల్లింపులు రూ.29,481 కోట్లు ఉండగా.. 2024-25 నాటికి రూ.32,967 కోట్లకు పెరిగాయి.

⏭ పాత ప్రభుత్వం వదిలేసి వెళ్లిన రూ.24,811 కోట్ల బకాయిలను ప్రస్తుత కూటమి ప్రభుత్వమే చెల్లిస్తోంది.

⏭ గత ప్రభుత్వ పాలనలో నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి 300 రోజులకంటే ఎక్కువగానే చేబదుళ్లు (వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్) వినియోగించారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వమే వినియోగించుకుంటుందనేలా కొన్ని పత్రికలు అసత్య ప్రచారం చేస్తున్నాయి. మార్కెట్ అప్పుల కంటే తక్కువ వడ్డీకి ఆర్.బీ.ఐ కల్పించిన ఈ సౌకర్యాన్ని దేశంలోని అన్ని ప్రభుత్వాలూ ఉపయోగించుకుంటున్నాయి.

**బకాయిల వసూలులో పర్యాటకాభివృద్ధి సంస్థ విఫలం**

ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ద్వారా 2020-23 మధ్య రూ.39.73 కోట్ల ఆస్తుల్ని సృష్టించినా.. అప్పటి ప్రభుత్వం నుంచి నిధులు అందకపోవటంతో ప్రాజెక్టులు నిలిచి పోయాయి. స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.33.68 కోట్లు వినియోగించక వృథా అయ్యాయి. ప్రభుత్వ నిర్వహణలోని హోటళ్లలో ఆక్యుపెన్సీ రేటు అత్యల్పంగా ఉండటంతో పాటు.. కొన్ని శిథిలావస్థకు చేరాయి. కొవిడ్ సమయంలో అందించిన సేవలు, లీజు అద్దె రూపంలో రావాల్సిన రూ.38.46 కోట్ల బకాయిల్ని వసూలు చేయటంలో ఏపీ టీడీసీఎల్ విఫలమైంది.

**ఆదాయార్జన శాఖల్లో అవకతవకలు**

⏭ 2022-23లో ఆదాయార్జన శాఖల్లో అంచనాలు తక్కువగా వేయటం వల్ల 596 కేసుల్లో.. రూ.30.62 కోట్ల నష్టం వాటిల్లింది. భూ మార్పిడి పన్ను తక్కువగా వసూలు చేయటం వల్ల ప్రభుత్వం రూ.5.82 కోట్ల రాబడి కోల్పోయింది. టైటిల్ డీడ్స్ విషయంలో అంచనాల తయారీలో నిర్లక్ష్యం వల్ల రూ.52.37 కోట్ల రిజిస్ట్రేషన్ రుసుము వసూలు కాలేదు.

⏭ 2018-19తో పోలిస్తే, 2019-23 మధ్య పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపు 50% తగ్గింది. కేటాయించినవీ సక్రమంగా వినియోగించకపోవటం గత ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనం.

## 123 రోజులు ఓవర్ డ్రాఫ్ట్
## కాగ్ నివేదికను తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నుంచి మొత్తం 123 రోజులు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకుందని కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) వెల్లడించింది. 2024-25 ఆర్థిక పరిస్థితిపై కాగ్ రూపొందించిన నివేదికను మార్చి 30న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. 2014-15లో 62 రోజులు చేబదులు తీసుకోగా, 2022-23లో అత్యధికంగా 328 రోజుల పాటు తీసుకున్నారు. 2024-25లో 123 రోజులకి చేబదులు రుణాలు తగ్గడం గమనార్హం.

**ఏటేటా పెరుగుతున్న అప్పులు**


రాష్ట్ర అప్పులు ఏటేటా పెరుగుతున్నాయి. 2020-21లో రూ. 2,78,018 కోట్లు ఉన్న ప్రభుత్వ అప్పులు 2024-25 నాటికి రూ.4,47,493 కోట్లకు పెరిగాయి.ప్రభుత్వ పూచీకత్తు అప్పులు 2020-21లో రూ. 1,05,007 కోట్లు ఉండగా, 2024-25 నాటికి రూ.2,41,528 కోట్లకు చేరాయి. ఈ అప్పులు మొత్తం రూ. 3.83 లక్షల కోట్ల నుంచి రూ. 6.89 కోట్లకు పెరిగింది.

**బాల్యవివాహాలకు కల్యాణ కానుక**

కల్యాణ లక్ష్మి పథకం నిధులు పక్కదారి పట్టినట్టు కాగ్ నివేదిక వెల్లడించింది. నిబంధనలకు విరుద్ధంగా అనర్హుల ఖాతాల్లోకి రూ. 55.12 కోట్లు చేరినట్టు ఆందోళన వ్యక్తం చేసింది. 2021-22 వార్షిక సంవత్సరం చివరికి ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తులు, అర్హుల నిర్ధారణ, ఆర్థిక సాయం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది.తక్కువ వయసున్న వధువులకు, అనర్హులకు ఈ నిధులు చేరినట్టు గుర్తించింది. (కాగ్ నివేదికపై పూర్తి విశ్లేషణ వచ్చే సంచికలో)

# స్పీకర్ల వ్యవస్థను, మన చట్టసభల పనితీరుని మార్చుకోలేమా?

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ -



సుమారు అయిదు దశాబ్దాలలో ఎన్నడూలేనిరీతిలో 18వ లోక్‌సభ స్పీకర్ పదవిపై ఎన్నిక దగ్గర్నుంచి వివాదాలు కొనసాగుతున్నాయి. అంతకుముందు కూడా రెండుసార్లు లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా.. ప్రస్తుత స్పీకర్‌పై రేగినంత రాజకీయ వివాదం లేదు. పాత భవనం స్థానంలో వచ్చిన కొత్త భవనం బ్రహ్మాండం. కానీ పార్లమెంటు చర్చల ప్రమాణాలు పెరగలేదు. స్పీకర్ పాత్రపై, మన చట్టసభల పనితీరుపై సమీక్ష అవసరమని తాజా లోక్‌సభ పరిణామాలు తెలియచేస్తున్నాయి. చట్టసభల కార్యక్రమాలకు సంబంధించిన అంశాలు మొక్కుబడి వ్యవహారం కావు.

శాసనవ్యవస్థకి ఉన్న మౌలిక ప్రాధాన్యతను పునరుద్ధరించే, హేతుబద్ధ బహిరంగ చర్చను పెంపొందించే పద్ధతులను మనం లోతుగా పరిశీలించాలి.

విభిన్న ప్రయోజనాలను శాంతియుతంగా సమన్వయం చేసే వేదిక ప్రాతినిధ్య చట్టసభ. ఒప్పించటానికి, ఒప్పుకోవటానికి; ఏకాభిప్రాయానికి రావటానికి; రాజీ పడటానికి అవసరమైన హేతుబద్ధ బహిరంగ చర్చను చేసే ప్రజాస్వామ్య నిలయం. చట్టాలు, వనరుల కేటాయింపు, పర్యవేక్షణ బాధ్యతల ద్వారా జాతి ప్రయోజనాన్ని పెంపొందించటమే ప్రజల ద్వారా ఎన్నికైన చట్టసభ ఎల్లవేళలా చేయవలసిన పని. చట్టసభ, స్పీకర్‌ల పనితీరును పరిశీలించటానికి ఇదే మనకి ప్రమాణం.

మన పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు బ్రిటిష్ వెస్ట్‌మినిస్టర్ పద్ధతిని అనుసరించి ఏర్పాటైనవి. కాబట్టి, బ్రిటన్ స్పీకర్ పాత్ర మనకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. బ్రిటన్‌లో ఆధునికకాలంలో స్పీకర్లు ఎక్కువ సందర్భాల్లో పోటీ ద్వారా ఎన్నికవుతారు. యుద్ధానంతర కాలాన్నే తీసుకుంటే.. దాదాపు స్పీకర్లందరూ ఏ పదవీలేని వెనుక బెంచ్ సభ్యుల నుండే వచ్చారు. మాజీ మంత్రిని స్పీకర్‌గా ఎన్నుకోకపోవటం ఇప్పుడు సంప్రదాయంగా స్థిరపడింది. కనజర్వేటివ్, లేబర్ – రెండు ప్రధాన పార్టీల మధ్య స్పీకర్‌లను ఒకరి తర్వాత ఒకరిని మార్చటం గత 60 ఏళ్లుగా సంప్రదాయంగా కొనసాగుతోంది. అందువల్లే స్పీకర్లు ప్రతిపక్ష బెంచ్‌ల నుండే తరచూ ఎన్నికవటం మనం చూస్తున్నాం. ప్రజాప్రతినిధుల సభ హౌస్ ఆఫ్ కామన్స్‌కి ప్రస్తుత స్పీకర్ లిండ్సే హోలీ.. లేబర్ పార్టీ ఎంపీయేగానీ, ఆయన 2019లో కనజర్వేటివ్ పార్టీ అధికారంలో ఉండగా స్పీకర్‌గా ఎన్నికయ్యారు. అంతకు ముందున్న జాన్ బెర్‌కౌ కనజర్వేటివ్ ఎంపీ. లేబర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2009లో ఆయన ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి అలా రెండు ప్రధాన పార్టీల మధ్య మారుతుండటం గత అరవై ఏళ్లుగా జరుగుతున్నప్పటికీ ఒక్క సందర్భం మినహాయింపు. లేబర్ పార్టీకి చెందిన మాజీ సభ్యుడు బెట్టీ బూత్రోయిడ్ 1992 నుండి 2000 వరకు స్పీకర్‌గా ఉన్నారు, ఆయన తదనంతరం కూడా లేబర్ పార్టీకి చెందిన మరో మాజీ సభ్యుడు మైఖేల్ మార్టిన్ 2000లో స్పీకర్ అయ్యారు.

ప్రస్తుత భారతదేశంలో స్పీకర్ ప్రతిపక్షం నుండి రాగలగటం ఊహించటం కూడా సాధ్యం కాదు. ఎందుకంటే, మన రాజకీయ సంస్కృతి భిన్నమైనది. స్పీకర్లు అధికారికంగానో, అనధికారికంగానో తమ పార్టీ అనుబంధాన్ని కొనసాగిస్తుంటారు. కీలక సందర్భాల్లో పార్టీకి అనుకూల ధోరణితో వ్యవహరిస్తుంటారు. ఉదాహరణకు, పదవ షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపు వ్యతిరేక నిబంధనల స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించటంలో చాలామంది సభాధ్యక్షులు విఫలమయ్యారు. రాష్ట్రం ఏర్పడి నిండా పుష్కరకాలంకాని తెలంగాణ ప్రస్తుత అసెంబ్లీలోనూ అదే పరిస్థితి. లోక్‌సభలో ప్రతిపక్షం తీరు కూడా భిన్నంగా ఏమీ లేదు. ప్రభుత్వం చేసిన ప్రతి నిర్ణయాన్నీ, చట్టం లేదా బడ్జెట్ ప్రతిపాదనని మంచి, చెడులతో సంబంధం లేకుండా గుడ్డిగా వ్యతిరేకించే ధోరణితో వ్యవహరిస్తోంది. దేశ ప్రయోజనాలు,

దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను వదిలేసి ప్రతిదీ శత్రు రాజ్యాల మధ్య పోరాటంలా తయారుచేశారు.

మన అనుభవం రీత్యా, బ్రిటిష్ పద్ధతులు కొన్ని మనకు అసాధ్యమైన అద్భుతాల్లా అబ్బురపరుస్తాయి. ఒక్కసారి స్పీకర్‌గా ఎన్నికయ్యాక అక్కడ సదరు సభ్యుడు తన పార్టీ సభ్యత్వాన్ని వదులుకుంటాడు. ప్రమాణాలను పాటిస్తూ, నిష్పాక్షిక రీతిలో వ్యవహరిస్తారు. స్పీకర్‌గా ఒక్కసారి ఎన్నికయ్యాక.. పార్లమెంటు నుండి రిటైరయ్యే వరకు స్పీకర్‌గానే కొనసాగుతారు; మాజీ స్పీకర్ ఒక మంత్రిగా ప్రభుత్వంలో ఎన్నటికీ చేరరు. కాకపోతే, రిటైర్మెంట్ తర్వాత మంత్రులతో సమాన హోదాను కల్పిస్తారు. ప్రభుత్వంలో చేరాలని, మంత్రులవ్వాలని భారతదేశంలోని సభాధ్యక్షుల కున్న ఆరాటానికి, బ్రిటన్‌లోని పద్ధతులకు మధ్య ఎంత తేడా ఉందో చూడండి. వాళ్లకి పూర్తి విరుద్ధ రాజకీయ సంస్కృతితో మనం వ్యవహరిస్తున్నాం.

ప్రజాప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ కామన్స్) స్పీకర్ ఎవరైనా పార్లమెంటుకి మళ్లీ పోటీ చేస్తే.. ప్రధాన పార్టీలు అతనిపై అభ్యర్థిని నిలబెట్టవు. అతను లేదా ఆమె తిరిగి ఎన్నికవటం ఖాయం.

ఆధునిక కాలంలో, గత 100 ఏళ్లలో, కేవలం రెండుసార్లు ఒక ప్రధాన పార్టీ, రెండు సందర్భాల్లోనూ లేబర్ పార్టీ, సాధారణ ఎన్నికల్లో స్పీకర్‌కు వ్యతిరేకంగా అభ్యర్థుల్ని నిల బెట్టింది. 1935లో స్పీకర్‌గా ఉన్న ఎడ్వర్డ్ ఫిట్జ్‌రాయ్‌కి వ్యతిరేకంగా డేవెంట్రీ నియోజకవర్గంలో లేబర్ అభ్యర్థిని నిలబెట్టింది. ఫిట్జ్‌రాయ్ చాతుర్యంతో ఆ ఎన్నికల్లో నెగారు. 1943లో రిటైర్మెంట్ వరకు స్పీకర్‌గా కొనసాగారు. అదేవిధంగా, ఫిబ్రవరి 1974 సాధారణ ఎన్నికల్లో, అక్టోబర్ 1974లో విర్రాల్ నియోజకవర్గంలో స్పీకర్ సెల్విన్ ల్లాయి డ్‌కి వ్యతిరేకంగా లేబర్ అభ్యర్థుల్ని నిలిపింది. రెండు సందర్భాల్లో ల్లాయిడ్ సులభంగా నెగ్గారు. 1976లో రిటైర్మెం ట్ వరకు స్పీకర్‌గా కొనసాగారు.

బ్రిటిష్ పార్లమెంటు 800 ఏళ్లకుపైగా పరిణామం చెందుతూ వస్తోంది. శతాబ్దాల అనుభవం.. ఆరోగ్యకరమైన సంప్రదా యాలు, పద్ధతులకు; ప్రధాన పార్టీల మధ్య పరస్పర విశ్వాసం, గౌరవానికి దారితీసింది.

చట్టసభల పనితీరుని మెరుగుపరచటానికి మనం ప్రక్రియను ప్రారంభించాలి. మన దేశంలో రాజకీయ వ్యవస్థ, చట్టసభల పనితీరు మొత్తం మీద పార్టీ నాయకుల కనుసన్నల్లో సాగు తుంటుంది. తరచూ, నాయకులకు హేతుబద్ధ చర్చ పట్ల ఆసక్తి ఉండదు. ప్రతిపక్షాలు మతిమాలిన, నిర్లక్ష్యపూరిత ధోరణితో ప్రతిదానికీ ప్రభుత్వాన్ని గుడ్డిగా వ్యతిరేకిస్తుంటే.. ప్రభుత్వమేమో చర్చను అణచివేసి తన మెజారిటీతో చట్టసభను శాసించాలని చూస్తోంది. ఇదీ మన సాంప్ర

**బ్రిటిష్ పార్లమెంటు 800 ఏళ్లకుపైగా పరిణామం చెందుతూ వస్తోంది. శతాబ్దాల అనుభవం.. ఆరోగ్యకరమైన సంప్రదా యాలు, పద్ధతులకు; ప్రధాన పార్టీల మధ్య పరస్పర విశ్వాసం, గౌరవానికి దారితీసింది.**

దాయం. పార్టీ నాయకులు హేతుబద్ధ చర్చను అనుమతించి నప్పుడల్లా, మన పార్లమెంటు అసమాన పనితీరును కనబరిచింది. 2017లో జి.ఎస్.టిబిల్లు, లోక్‌పాల్ బిల్లుపై 2013లో జరిగిన చర్చలు అసాధారణ స్థాయిలో ఉన్నాయి. సభ్యులకు స్వేచ్ఛనిచ్చినప్పుడల్లా మన చట్టసభలు ఉన్నత ప్రమాణాలను అందుకున్నాయి.


**చట్టసభలు సరిగా పనిచేయగలిగేలా మనకు మూడు సంస్కరణలు అవసరం**

**మొదటిది,** పదవ షెడ్యూల్‌ని అప్రస్తుతం చేయాలి. చర్చ ఓ సభ్యుడిని ఒప్పించలేనప్పుడు, బిల్లులోని మంచి అంశాలతో సంబంధం లేకుండా ఎంపీలు పార్టీ విప్‌కి అనుగుణంగా ఓటు వేయాలనే నిర్బంధం ఉంటే ఏమవుతుంది?.. చట్టసభ నామమాత్రమవుతుంది. ప్రజాప్రతినిధిగా లోతైన పరిశీలన చేయాలనే రాజ్యాంగ బాధ్యతకు, చట్టసభలోని చర్చకు అర్థమన్నదే ఉండదు. ఓట్లు గుడ్డిగా వేస్తారు. కాబట్టి ఫిరా యింపు వ్యతిరేక నిబంధనల్ని వెనక్కి తీసుకోవాల్సుంది. లేకుంటే, అవిశ్వాస తీర్మానం, బడ్జెట్‌లకు మాత్రమే పరిమితం చేయాలి.


**రెండోది,** చట్టసభలో తమ విజ్ఞతకి అనుగుణంగా సభలో ఓటు వేసే స్వేచ్ఛ సభ్యులకు ఉన్నప్పటికీ వారి రాజకీయ భవిష్యత్తు ఇప్పటికీ పూర్తిగా రాజకీయ నేతల చేతుల్లో ఉంది. ఏ సభ్యుడైనా పార్టీ ఆదేశాలతో విభేదిస్తే ఎన్నికల్లో పోటీకి అతనికి టికెట్ లభించదు. ఒక ప్రధాన పార్టీ పోటీకి 'సీటు'ని తిరస్కరిస్తే, మన ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ ఎన్నికల వ్యవస్థలో అది సాధారణంగా రాజకీయ మరణశాసనం. కాబట్టి, రహస్య బ్యాలెట్ ద్వారా నాయకత్వ ఎన్నిక, పార్టీ సభ్యులు లేదా ఎన్నికైన పార్టీ ప్రతినిధుల ద్వారా అభ్యర్థులను ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోవటం తప్పనిసరి చేయాలి.

**మూడోది,** చట్టసభలలో కమిటీ వ్యవస్థను బలోపేతం చేయా లి. అమెరికా చట్టసభ కాంగ్రెస్ గురించి ఉడ్రో విల్సన్ చెప్పి నట్లు, "సమావేశాల్లో ఉన్న కాంగ్రెస్ అలంకారప్రాయం; కమిటీల్లోని కాంగ్రెస్ నిజంగా పనిచేస్తున్న కాంగ్రెస్". మన చట్టసభలు తరచూ అతిశయోక్తులు, అతిశయాలు, విపరీత పార్టీ పక్షపాత ధోరణుల్లో కొట్టుకుపోతున్నాయి. కమిటీల్లో చర్చ, ప్రజల్లో ప్రచారం, పార్టీ ఒత్తిడులు, సరైన సమా చారం, వాస్తవాల హేతుబద్ధ చర్చ, శాంతియుతంగా ఏకాభిప్రాయం ఉన్నప్పుడు.. జాతి ప్రయోజనంపై అంగీ కారం లేదా మధ్యేమార్గం సాధ్యమవుతాయి.

# బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు - అంబేద్కర్ దార్శనికత




ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా కొన్ని దశాబ్దాలుగా వాదిస్తున్న సంస్కరణల భాష ఇటీవల భారత రాజకీయాల్లో ప్రాచుర్యంలోకి వస్తోంది. ప్రజలకు, ముఖ్యంగా యువతకు వేగంగా చేరే అవకాశమున్న సోషల్ మీడియా వేదికల్లో కూడా క్రమంగా జేపీ భావజాలంపై చర్చలు పెరుగుతున్నాయి. ఇందులో భాగంగా, కొందరు ఔత్సాహిక జర్నలిస్టులు ఇటీవల ఒక ప్రయత్నం ప్రారంభించారు. 'ది కామన్ మ్యాన్ షో' పేరుతో భారతీయులకు వాస్తవాలు తెలియచేయటానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందువల్లే ట్యాగ్ లైన్‌గా 'వాయిస్ ఫర్ ఇండియా' అనే పదాల్ని ఉపయోగించారు. మన దేశంలో రాజకీయ పార్టీల్లో ప్రజలకు మంచి చేయాలనుకునే నాయకులే ఎక్కువ. అయితే వారు చేయగలిగిన మంచికి, ఓటుగా మారే ప్రజాభిప్రాయానికి మధ్య వైరుధ్యం ఉండకూడదు. అంటే, ప్రజలు దేనికి ఓటు వేస్తారో ఆ పని ఎంత మంచిదైనా చేయటానికి మన నేతలు, పార్టీలు సిద్ధం. నేతల నుండి ఏమి అడగాలో తెలియాలంటే, ఆయా అంశాలతోపాటు.. వాటిల్లో నిజానిజాలు కూడా తెలియాలి. లేకుంటే, ఎప్పుడో జనబాహుళ్యంలో స్థిరపడిపోయిన అపోహల్ని వాట్సాప్ యూనివర్సిటీల ద్వారా వ్యాప్తి చేయటం, వాటిని నమ్మేసి ఓటేయటం, మోసపోయామని ఆ తర్వాత వగచటం, మళ్లీ ఎన్నికలకి మరో నకిలీ వార్త ప్రచారం కావటం.. ఇలా విషవలయం కొనసాగుతుంటుంది. ఈ విషవలయాన్ని ఛేదించి, ప్రజలకు వాస్తవాల్ని తెలియచేయటానికి, సరైన అభిప్రాయాలను ఏర్పరచుకోవటానికి తగిన సమాచారం ఇచ్చేందుకు ఈ షోను ప్రారంభించారు. స్వతంత్ర సెంటర్ దీనికి నాలెడ్జ్ పార్టనర్‌గా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా, ప్రజలకు మౌలికంగా అవసరమైన, రాజకీయ పార్టీలు తెర మీదకు తెస్తున్న కొన్ని అంశాలను గుర్తిస్తారు. ఒక్కో అంశం మీద నాలుగు ఎపిసోడ్లు రూపొందించి ప్రసారం చేస్తారు. ప్రతి అంశంలో నలుగురు నిష్ణాతులు ఆయా ప్రశ్నలకు సమాధానమిస్తారు. ఏకాభిప్రాయం వచ్చిన మేర ఒక తీర్మానం చేస్తారు. ఆ ప్రతిని ప్రభుత్వాలకు పంపి విధానాల రూపకల్పనలో భాగం చేసేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తారు. మార్చి 2026లో మొదటి అంశం ఎపిసోడ్ ప్రసారమైంది. మొదటగా రిజర్వేషన్ల అంశాన్ని ఎంపిక చేశారు. తెలంగాణలో మొదలై, ఆంధ్రప్రదేశ్ సహా మరికొన్ని



**రిజర్వేషన్లు తాత్కాలికం (ఓ పదేళ్లపాటు) అని అంబేద్కర్ ఆర్టికల్ 334 ద్వారా రాజ్యాంగంలోనే స్పష్టం చేసినా.. 'సమానత్వ' సూత్రానికి విఘాతం కలగకుండా ఉండాలంటే ఎంత శాతం ఉండాలనే విషయాన్ని రాజ్యాంగంలో పేర్కొనలేదు. ఈ విషయాన్ని 1992లో సుప్రీంకోర్టు తేల్చి చెబుతూ, 50%ని పరిమితిగా పేర్కొంది. అంటే, ఏ రిజర్వేషన్ అయినా ఆ పరిధిలోనే ఉండాలి. ఆ పరిమితిలో ఉంటేనే, అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు లభిస్తాయని తెలిపింది.**

రాష్ట్రాల్లో కూడా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై డిమాండ్లు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీల విన్యాసాల నేపథ్యంలో ఈ చర్చ తీసుకున్నారు. రిజర్వేషన్లు అనగానే.. బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రస్తావన అనివార్యం. రాజ్యాంగ నిర్మాతగా కూడా ఆయన ఎస్.సి, ఎస్.టిలకు రిజర్వేషన్లను అందులో 330, 332 అధికరణాల ద్వారా అందించారు కాబట్టి.. ఆ రకంగానే తమకూ జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం చట్టసభల్లో ఇవ్వాలని కోరుతున్నారు కాబట్టి ఆయనతోనే చర్చను ప్రారంభించారు. అదేవిధంగా, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లలో భాగంగా కోటాకున్న 50% పరిమితిని తొలగిస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ హామీ ఇవ్వటంతో వాటిపై జాతీయోద్యమ నేతలు, రాజ్యాంగ నిర్మాతల ఆలోచనల్ని చర్చించాల్సి వచ్చింది.

రిజర్వేషన్లపై మొదటి ఎపిసోడ్ చర్చలో ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, బీజేపీ నేత ప్రొఫెసర్ లక్ష్మణ్, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఈశ్వరయ్య పాల్గొన్నారు. రిజర్వేషన్లు ఎంత శాతం ఉండాలి? ఎంత శాతం రాజ్యాంగపరంగా సాధ్యం? జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అందరికీ ఇవ్వటం రాజ్యాంగబద్ధమా? ఈ అంశంపై రాజ్యాంగసభ చర్చల్లో అంబేద్కర్ ఏం చెప్పారు? సుప్రీంకోర్టు తీర్పు ఏమి తేల్చింది? ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఉండాలా, వద్దా.. మొదలైన అంశాల్ని రెండు గంటలకు పైగా చర్చించారు. ఆ వీడియోను 'జేపీ లోక్‌సత్తా' యూట్యూబ్ ఛానల్‌లో చూడవచ్చు. అందులోని కొన్ని అంశాలతోపాటు.. 1930లలో ముస్లింల తరహాలో ఎస్.సి, ఎస్.టిల రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రత్యేక నియోజకవర్గాలు డిమాండ్ చేసిన అంబేద్కర్ రాజ్యాంగ రచనలో ఆ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదు, బీసీ రిజర్వేషన్లపై అంబేద్కర్ వైఖరి తదితర అంశాలను ప్రస్తావించే ప్రయత్నం ఈ వ్యాసం.

❖ రిజర్వేషన్లు 'మినహాయింపు' మాత్రమే, అవి 'సమానత్వం' (ఈక్వల్ ఆపర్చునిటీస్) అనే రాజ్యాంగ మౌలిక సూత్రానికి విఘాతం కలిగించకూడదు అని అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పారు. ఈ అంశాన్ని కామన్ మ్యాన్ షోలో మిగిలిన వక్తలంతా వ్యతిరేకించినా.. జేపీ చాలా స్పష్టంగా అంబేద్కర్ చెప్పిన మాటల్ని ఉటంకిస్తూ పేర్కొన్నారు.

❖ రిజర్వేషన్లు తాత్కాలికం (ఓ పదేళ్లపాటు) అని అంబేద్కర్ ఆర్టికల్ 334 ద్వారా రాజ్యాంగంలోనే స్పష్టం చేసినా.. 'సమానత్వ' సూత్రానికి విఘాతం కలగకుండా ఉండాలంటే ఎంత శాతం ఉండాలనే విషయాన్ని రాజ్యాంగంలో పేర్కొనలేదు. ఈ విషయాన్ని 1992లో సుప్రీంకోర్టు తేల్చి చెబుతూ, 50%ని పరిమితిగా పేర్కొంది. అంటే, ఏ రిజర్వేషన్ అయినా ఆ పరిధిలోనే ఉండాలి. ఆ పరిమితిలో ఉంటేనే, అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలు లభిస్తాయని తెలిపింది.

❖ రాజకీయాలలో ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా రిజర్వేషన్లు ఇవ్వాలని 1930లో గాంధీతో వాదించిన అంబేద్కర్.. ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో రాజకీయ రిజర్వేషన్ల పట్ల రాజ్యాంగంలో ఆచితూచి వ్యవహరించారు. సాధారణ నియోజకవర్గాలలోనే ఎస్.సి, ఎస్.టిలకు ప్రాతినిధ్యం కల్పించటం, వాటికీ కాలపరిమితి ఉండటం, మిగిలినవారికీ రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తే దేశం ముక్కలయ్యే ప్రమాదం ఉంది కాబట్టి.. వాటిని అంతవరకే పరిమితం చేయటమనే సూత్రాన్ని రాజ్యాంగనిర్మాణంలో

అంబేద్కర్ పాటించారు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను రద్దు చేయాలని అంబేద్కర్‌తోపాటు వల్లభాయ్ పటేల్ కూడా గట్టిగా వాదించారు.

❖ రాజ్యాంగసభలోనే సామాజికంగా, విద్యపరంగా వెనుకబడిన వర్గాల (బీసీల)కు రిజర్వేషన్ల గురించి చర్చ వచ్చింది. వారికి పాలనలో, అంటే, ప్రభుత్వోద్యోగాలలో మినహాయింపు ఉండాలని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు. అందుకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించకుండా.. అందుకు వీలు కల్పించే 340వ అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చారు. అయితే రాజకీయ రిజర్వేషన్లు బీసీలకూ ఉండాలన్న వాదనతో అంబేద్కర్ ఏకీభవించలేదు. దీనివల్ల భారత్‌లోని అసాధారణ వైవిధ్యం దేశాన్ని ముక్కలు చేస్తుందనే అభిప్రాయాన్ని, ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. అదేవిధంగా, విద్యలో కూడా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వటానికి అంబేద్కర్ సుముఖత వ్యక్తం చేశారు. ఈ రకంగానే రాజ్యాంగానికి మొట్టమొదటి సవరణ వచ్చింది. దీని ద్వారా విద్యాసంస్థల్లో బీసీలకు కోటానిచ్చేందుకు 15 (4) క్లాజ్‌ను చేర్చారు.

❖ ఇప్పుడు 50% పరిమితి ఉంది కాబట్టి.. ఆ పరిధిలో బీసీలకు స్థానిక ప్రభుత్వాల్లో రిజర్వేషన్లు ఇస్తున్నారు. ఇది సబబైన చర్య. సమస్య ఎన్నికల సంఘంలో, బీసీ రాజకీయ రిజర్వేషన్లలో, ఆ మాటకొస్తే ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లలో లేదు. 50 శాతం లోపల ఏ రకంగానైనా ఇవ్వొచ్చు. అదేవిధంగా, మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ అమలైనా, ఇదే సమస్య ఎదురవుతుంది. ఏమిటి? కోట్ల రూపాయల డబ్బు ఖర్చు చేయగలిగే స్తోమతు ఉండటం. అగ్రవర్ణాల చేతుల్లో దళిత, వెనుకబడిన, పేద నాయకులు ఎందుకు పావులుగా ఉంటారంటే.. అది కులం కన్నా, డబ్బు సమస్య. ఎన్నికల్లో లెక్కలు చూపని డబ్బు, చాలామంది అభ్యర్థుల్ని పార్టీలకు బానిసలుగా మారుస్తోంది. కాబట్టి, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించే ప్రయత్నంతో రాజ్యాంగ సమానావకాశాల సూత్రానికి, అంబేద్కర్ అభిప్రాయానికి విఘాతం కలిగించకుండా.. డబ్బుతో ప్రమేయంలేకుండా సమర్థులు, నిజాయతీపరులైన సామాన్యులు కూడా ఎన్నికల్లో గెలవగలిగేలా, ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల కోసం ప్రయత్నించటం మేలు.

❖అదేవిధంగా, రిజర్వేషన్ల ద్వారా ఒకసారి లబ్ధిపొందిన వారు స్వచ్ఛందంగా వదులుకుని ఆ కులాల్లోనే దిగువన ఉన్నవారికి అవకాశాలివ్వాలి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మంత్రుల పిల్లలు కూడా రిజర్వేషన్లు అడిగితే అర్థమేముంటుంది? ఆర్థికంగా ఎంత ఎదిగినా, కుల వివక్ష

**రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించే ప్రయత్నంతో రాజ్యాంగ సమానావకాశాల సూత్రానికి, అంబేద్కర్ అభిప్రాయానికి విఘాతం కలిగించకుండా.. డబ్బుతో ప్రమేయంలేకుండా సమర్థులు, నిజాయతీ పరులైన సామా న్యులు కూడా ఎన్నికల్లో గెలవగలిగేలా, ప్రతి ఓటుకూ విలువ ఉండేలా దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల కోసం ప్రయత్నించటం మేలు.**

కొనసాగుతోంది అనటం సమస్యను అవగాహనలేకో, ఉద్దేశ పూర్వకంగానో పెంచటం తప్ప.. ఆ వాదనలో పస లేదు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఆచరణసాధ్యం కాదుగానీ, వాటిని అడగటానికి కారణమేంటి? ఆ సంస్థలు స్థాపించే వారి వద్ద డబ్బుంది, ఆర్థికాభివృద్ధే రిజర్వేషన్ల సమస్యకు పరిష్కారం కాబట్టి. ఈ కారణంగానే ఆర్థికంగా వెనుకబడిన రిజర్వేషనేతర కులాల్లోవారికి కొంత మార్కులు కలపటం వంటి తోడ్పాటు అవసరం. అయితే ప్రభుత్వం, పార్టీలు ఏకాభిప్రాయంతోనే అయినా..వినూత్నంగా ఆలోచించకుండా అనాలోచితంగా ఈడబ్ల్యూఎస్ బిల్లును ఆమోదించారు. ఇంకా నయం, రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వలేదు.

**భ్రమల చుట్టూ పరిభ్రమించొద్దు**

ఈ నేపథ్యంలో.. మూసపద్ధతిలో రిజర్వేషన్లే సర్వరోగ నివారిణి అన్నట్లు భ్రమింపచేయటం, భ్రమపడటం అనవసరం. ఉద్యమాల పేరుతో ఎంత భ్రమల చుట్టూ పరిభ్రమిస్తున్నారో తెలంగాణ స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్ని చూస్తే అర్థమవుతుంది. స్థానిక ప్రభుత్వాల్లో బీసీలు, మహిళలు, మిగతావారికి కలిపి 75% రిజర్వేషన్లున్నా, ఆ ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు లేవు. డమ్మీలు. ఈ అసలు సమస్య కోసం కొట్లాడకుండా.. 42% రిజర్వేషన్ల డిమాండ్ చుట్టూ బీసీ సంఘాలు ఉద్యమాలు చేశాయి. చివరికి తెలంగాణ మునిసిపల్ ఎన్నికల్లో 61% మంది బీసీలు గెలిచారు. కాబట్టి.. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రమాణంగా తీసుకుని, 50% లోపు రిజర్వేషన్ల వ్యవస్థను సంస్కరించటం, అంబేద్కర్ ఆశించినట్లు విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి అంశాల ద్వారా కులవివక్షను అధిగమించి సమానావకాశాలను అందుకోవటం, రాజకీయాలలో ప్రాతినిధ్యం కోసం స్థానిక ప్రభుత్వాల సాధికారత, డబ్బు సమస్యలేని దామాషా ఎన్నికల పద్ధతి, రాజకీయ పార్టీల్ని ప్రజాస్వామీకరించటం వంటి నిజమైన పరిష్కారాల కోసం కృషి చేయటం అన్ని వర్గాల ప్రజలకూ సరైన కార్యాచరణ. ✦

# వికేంద్రీకరణకు పెద్దపీట వేసిన జస్టిస్ కురియన్ కమిటీ తొలి నివేదిక



జనాభా నియంత్రణ సమర్థంగా పాటించిన, ఆర్థికంగా దేశ ఖజానాకి ఎక్కువ జమ చేసే స్థాయి అభివృద్ధి సాధించిన దక్షిణాది రాష్ట్రాలు ఆ పురోగమనానికి నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో మూల్యం చెల్లించాల్సుంటుందనే భయాందోళనల నేపథ్యంలో.. దక్షిణాది, బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలు కొన్ని సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. చెన్నైలో నిర్వహించిన మొదటి సదస్సులో కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఒక కమిటీని అప్పుడు ఏర్పాటు చేశారు. ఆ కమిటీ రూపొందించిన ప్రశ్నావళికి సమాధానాలు ఇవ్వాలని, ఆన్‌లైన్‌లో ఒక వెబ్‌సైట్‌లో వాటిని నమో దు చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కొంత కాలం క్రితం అన్ని బీజేపీయేతర ప్రభుత్వాలు, ప్రధాన రాజకీయ పార్టీలకు లేఖ రాశారు. ఏప్రిల్ 2025లో ఏర్పాటైన కమిటీ.. నివేదిక తొలిభాగాన్ని ఫిబ్రవరి 2026లో సమర్పించింది.

ఎన్నికల వ్యూహంలో భాగంగానో ఏమో కమిటీ ప్రాథమిక నివేదికను స్టాలిన్ అసెంబ్లీలో విడుదల చేశారు. ఎన్నికల హడావుడిలో నివేదికను ఎవరూ పెద్దగా పట్టించు కోలేదు గానీ.. కమిటీ కొన్ని విలువైన సూచనల్ని చేసింది. ముఖ్యం గా ఫెడరలిజం తదుపరి దశకు ఒక మార్గసూచీని అందించే ప్రయత్నం చేసింది. అంతకుముందు 1969లో డీఎంకే ప్రభుత్వం మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ పీవీ రాజమన్నార్ నేతృత్వంలో ఇదే అంశంపై వేసిన కమిటీ నివేదికలోని అంశాలు చాలావరకు పునరా వృతమైనట్లు కనిపిస్తుంది.

ముగ్గురు సభ్యుల రాజమన్నార్ కమిటీ 1971లో సమర్పించిన నివేదికను యూనియన్ ప్రభుత్వం అప్పట్లో పెద్దగా పట్టించుకోకుండా పక్కన పడేసింది. ఆ తర్వాత ఎన్.టి.ఆర్ చొరవతో పరిస్థితులు మారటంతో జస్టిస్ సర్కారియా కమిషన్ నివేదికను కొంతమేర అమలు చేసింది. రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను యూనియన్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసే ఆర్టికల్ 356 వినియోగానికి కూడా 1994లో ఎస్.ఆర్ బొమ్మయ్ కేసులో తీర్పు తర్వాత కళ్లెం పడింది.

ఏప్రిల్ 23న తమిళనాడు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రాల కోణం నుండి చూస్తే ఫెడరలిజాన్ని మరింత బలోపేతం చేసేలా జస్టిస్ కురియన్ కమిటీ సిఫార్సులున్నందున.. ఎన్నికల ఫలితాలతో సంబంధంలేకుండా వాటిని పరిశీలించటం అవసరం. కొన్ని ప్రధానమైనవి:

**కేంద్రీకృత పాలన పెరిగింది** .. నిజమైన సహకార సమాఖ్య వ్యవస్థను అమలు చేసి సమతూకం పాటించండి: భారత్‌లో అధికార కేంద్రీకరణ పెరిగిపోయింది. దీంతో ఫెడరల్ సమతూకం దెబ్బతింటోంది. నిజమైన సహకార సమాఖ్య వ్యవస్థకు అవసరమైన వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమతౌల్యం తీసుకురావటం అవసరం.

**గవర్నర్ల వ్యవస్థను సంస్కరించండి:** రాజకీయ పక్షపాతాలకు ఆస్కారం లేకుండా గవర్నర్ల నియామక ప్రక్రియను మార్చండి. అదేవిధంగా, గవర్నర్ కార్యాలయానికి ఆమోదం కోసం అసెంబ్లీ పంపించే బిల్లుల్ని ఆమోదించటానికి నిర్ణీత కాలవ్యవధి ఏర్పాటు చేయాలి.

✯ గవర్నర్లకు అయిదేళ్ల స్థిర పదవీకాలం ఉండాలి. రెండోసారి ఎంపిక చేయకూడదు.

✯ ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్లు బహిరంగంగా విమర్శించకూడదు. ప్రయివేటుగా, రాజ్యాంగ పద్ధతుల్లో తమ అభ్యంతరాలను తెలియచేయాలి.

✯ రాష్ట్ర అసెంబ్లీ రద్దును మంత్రివర్గ సలహా మేరకే చేయాలి. లోక్ భవన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం పెత్తనం చెలాయించకుండా ఈ సంస్కరణలు దోహదపడతాయి.

ఏకపక్షంగా రాష్ట్రాల సరిహద్దులు మార్చే ధోరణికి స్వస్తి చెప్పాలి: ఆర్టికల్ 3 కింద రాష్ట్రాల సరిహద్దులు, పేర్లను మార్చటానికి జాతీయస్థాయి ప్రభుత్వానికి విశేషాధికారాలున్నాయి. వీటిని వినియోగించే ముందు రాష్ట్రాల అనుమతి తీసుకోవటం తప్పనిసరి చేయాలి.

**ఫెడరలిజంపై రాజ్యాంగ సవరణ ప్రక్రియను కఠినతరం చేయండి:** రాజ్యాంగ సవరణల్ని పార్లమెంటులో మెజారిటీ ఉన్న పార్టీ హడావుడిగా ఆమోదించే అవకాశంలేకుండా ప్రక్రియను కఠినతరం చేయాలి. ముఖ్యంగా ఫెడరలిజానికి సంబంధించిన అంశాల్లో రాష్ట్రాల మాటకు వీలైనంత అవకాశం కల్పించేలా ప్రక్రియను విస్తరించాలి.

✯ రాజ్యాంగ మౌలిక స్వభావ సూత్రాన్ని క్రోడీకరించేందుకు ఆర్టికల్ 368ని సవరించాలి. ఫెడరలిజం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజాలను ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చటానికి వీల్లేదని స్పష్టంగా పేర్కొనండి.

✯ దేశ జనాభాలో మూడింట రెండొంతులకు ప్రాతినిధ్యం వహించే మూడింట రెండొంతులు రాష్ట్రాలు కోరితే పార్లమెంటు ఆ రాజ్యాంగ సవరణల్ని పరిగణలోకి తీసుకోవాలి.

విధాన నిర్ణయాల్లో రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని పరిరక్షించాలి: స్థానిక పాలన ఎక్కువ ప్రభావశీలంగా ఉండే అంశాలను ఉమ్మడి జాబితా నుండి రాష్ట్రాలకు బదిలీ చేయాలి. నీట్ తదితర పరీక్షలు, ఆరోగ్య పాలన రాష్ట్రాల పరిధిలోకి కేటాయించాలి.

**ఎన్నికల అధికారాలు:** రాష్ట్రాల ఎన్నికల సంఘాలకు మరింత ఎక్కువ బాధ్యతల్ని కేటాయించాలి. ముఖ్యంగా రాష్ట్ర, స్థానిక ఎన్నికలను ఎస్.ఈ.సీ పరిధిలోకి తేవాలి. కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ స్థాయి ఎన్నికలకే పరిమితం కావాలి. రాష్ట్రాలు తమ ఎన్నికలను, పరిపాలనను స్వతంత్రంగా నిర్వహించుకుంటాయి.

**ఒకే భాష ఆధిపత్యం ఉండకూడదు:** ఒకే భాష ఆధిపత్య భావనను కమిటీ తిరస్కరించింది. రెండు భాషలలో నైపుణ్యం సంపాదించాలని, స్థానిక భాషలను పరిరక్షించాలని, భాషా వైవిధ్యాన్ని అణచివేయకూడదని పేర్కొంది.

**జి.ఎస్.టి, ఆర్థిక ఫెడరలిజం:** కేంద్రం, రాష్ట్రాలు కలసి నియమించిన సెక్రటరీ–జనరల్ నేతృత్వంలో ఒక శాశ్వత,

### గవర్నర్ల విషయంలో మరికొన్ని సిఫార్సులు

☛ శాసనసభలోని మెజారిటీ సభ్యులు ఆమోదించిన ముగ్గురిని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ పదవికి ప్రతిపాదించాలి. వారిలో ఒకరిని రాష్ట్రపతి గవర్నర్‌గా నియమించాలి.

☛ శాసనసభ మెజారిటీ సభ్యుల తీర్మానం మేరకే గవర్నర్‌ను పదవి నుండి తప్పించాలి. ఆ తీర్మానంపై 14 రోజుల్లోపు రాజ్యాంగబద్ధమైన చర్యలను రాష్ట్రపతి చేపట్టాలి. దానికి అనుగుణంగా అధికరణ 155ను సవరించాలి.

☛ అధికరణ 156ను సవరించి గవర్నర్ అయిదేళ్లు స్థిరంగా ఒకేచోట ఉండేలా చూడటంతోపాటు.. కొత్త గవర్నర్ వచ్చే వరకూ హైకోర్టు సీజేకి బాధ్యతలు అప్పగించాలి.

☛ రాష్ట్రానికి బయటి వ్యక్తి, విశిష్ట వ్యక్తి గవర్నర్‌గా ఉండాలి. గత అయిదేళ్లలో పరిపాలన, శాసనసభ, న్యాయశాఖ కింద ఎలాంటి రాజకీయ లేక ఆదాయాన్నిచ్చే పదవిని చేపట్టకూడదనే నిబంధనను తప్పనిసరి చేయాలి.

☛ ఇటీవల పలు రాష్ట్రాల గవర్నర్లు బహిరంగంగా విమర్శలకు దిగిన నేపథ్యంలో ఆ రాజ్యాంగ పదవిలో ఉన్నవారిపై నియంత్రణను తప్పనిసరి చేయాలి. సంప్రదాయంగా, వివాదాస్పదంగా ఉన్న అధికరణ 176 (ప్రత్యేక ప్రసంగం)ను తొలగించాలి.

☛ రాష్ట్ర జాబితా బిల్లుల్ని అనవసరంగా రిజర్వులో పెట్టొద్దు. అలాంటి బిల్లులకు 15 రోజుల్లోపు ఆమోదం తెలపాలి లేదా వెనక్కు పంపాలి. వెనక్కి వచ్చిన బిల్లును శాసనసభ మళ్లీ పంపితే 15 రోజుల్లోగా ఆమోదించాలి.

☛ యూనియన్ బిల్లులకు వ్యతిరేకమైనవాటినే రిజర్వులో ఉంచాలి. వాటికి 60 రోజుల్లోపు కారణాలను జత చేయాలి.

☛ బిల్లులకు ఆమోదం తెలిపేందుకు, వెనక్కి పంపేందుకు, రిజర్వులో ఉంచేందుకు అధికరణ 200, 201ను సవరించాలి. గడువు పూర్తయిన తర్వాత గవర్నర్ వద్దే బిల్లులు ఉంటే ఆమోదించినట్లు పరిగణించాలి.

స్వతంత్ర ప్రతిపత్తిగల జి.ఎస్.టి సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.

✯ ఆర్థిక నిర్ణయాల ప్రక్రియలో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంచాలి. పన్నుల డబ్బు బదిలీ, వ్యయం అధికారాలలో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని పెంచాలి. నిజమైన ఫెడరల్ క్రమశిక్షణకు భరోసా కల్పించాలి.

ప్రస్తుత రాజ్యాంగం పరిధిలోనే, అది కూడా యూనియన్, రాష్ట్రాల పరిధిలోనే ఫెడరలిజం బలోపేతంపై జస్టిస్ కురియన్ కమిటీ తొలి నివేదిక ప్రధానంగా కేంద్రీకరించింది. రాష్ట్రాలకు మరిన్ని వెసులుబాట్లు అవసరమ నటంలో సందేహం లేదు. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి వంటి అంశాలను ఇప్పటికే ప్రతిపాదించారు. గవర్నర్లు, ఉమ్మడి జాబితాలోని అంశాల్లో కొన్నిటిని రాష్ట్రాలకు బదిలీ చేయటం, మిగిలిన అంశాలు యూనియన్ పరిధిలోకి మాత్రమే వెళ్లాలన్న కేంద్రీకృత వైఖరి మొదలైన అంశాలపై పలు సందర్భాల్లో స్పష్టతనిచ్చారు. అయితే ఇప్పటికే రాష్ట్రాలకున్న అధికారాలను, అందుతున్న భారీ నిధులను సద్వినియోగం చేయకుండా ఇంకా కావాలనటం..ఉట్టికెగరలేనివారు ఆకాశానికెగరాలని కోరుకున్నట్లుంటుంది.

అందువల్ల, సంక్షేమం-అభివృద్ధి సమతూ కం, అప్పులు చేసి తెచ్చిన డబ్బు భవిష్యత్తు తరాలకి ఆస్తులు సృష్టించటానికి తప్ప రోజువారీ ఖర్చుకి ఉపయోగిం చకపోవటం, పెట్టుబడుల్ని, గ్రామాల మధ్య పట్టణీకరణని ప్రోత్సహించటం, తయారీరంగాన్ని, జిల్లా నుండి ఎగుమతు ల్ని పెంచటానికి తగిన నైపుణ్యాభివృద్ధితోపాటు..రాష్ట్రానికి వచ్చే నిధుల్లో స్థానిక ప్రభుత్వాలకు కనీసం 50% కేటా యించి అక్కడ విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, పెట్టు బడులు మొదలైన అంశాలపై అంబుడ్స్‌మన్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించటం మీద జేపీ ఎక్కువ దృష్టి కేంద్రీకరించారు. ✦

# స్వచ్ఛంద సంస్థలు ప్రశ్నించాలి.. పార్టీలు, ప్రజలకు రాజకీయ దిశానిర్దేశం చేయాలి




ప్రజాస్వామ్య వ్యవస్థలోని లోపాలను రాజకీయ పార్టీలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రశ్నించాలని, అవగాహనతో పరిష్కారంలో భాగమవ్వాలని లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కొన్ని సమస్యల్ని నేరుగా పాలకుల ద్వారా పరిష్కరిం చవచ్చని, ప్రభుత్వాలు, పార్టీలు పట్టించుకోనప్పుడు సదస్సులతో ప్రజలను చైతన్యపరచి సమీకరించాలన్నారు. ప్రజలు కోరితే, వారి ఓట్ల కోసం పార్టీలు ఏ డిమాండ్ నైనా నెరవేరుస్తాయన్నారు. ఆచరణసాధ్యమైన ఎంత మంచినైనా అలవోకగా చేస్తాయన్నారు. విజయనగరం జిల్లా కణపాక యూత్ హాస్టల్లో మాతృభూమి సేవాసంఘం మొదటి వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు ఇప్పలవలస గోపాలరావు అధ్యక్షత వహించారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. పార్టీలన్నీ అధికార రాజకీయంలో మునిగితేలుతూ ఉచితాలు, కులాలవారీ కార్పొరేషన్లు వంటి వాటితో నెట్టుకొస్తున్నాయన్నారు. ప్రజలకు నిజంగా పనికొచ్చేవి, భవిష్యత్తుని కాపాడేవి నూటికి ఇరవై కూడా చేయటం లేదన్నారు. అధికార పక్షంతో పాటు ప్రతిపక్షం కూడా ఇదే రీతిలో ఆలోచించటం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సమ యంలో సమాజానికి స్వచ్ఛంద సంస్థలు సరైన దిశానిర్దేశం చేయాలని, మౌలికాంశాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మనం సంక్షేమానికి వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధితో సమతూకం ఉందా? అనేది బేరీజు వేసుకోవాలన్నారు. పౌర సమాజం మౌనం వహించినా, అనర్హులకు మద్ద తిచ్చినా, అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు నష్టపోతా రన్నారు. మనకు నాయకులు చుట్టాలు కాదని, ఎవరు మంచి చేసినా ప్రోత్సహిస్తూ, ఇంకా మంచి చేయించటమే మన పని అన్నారు. ఇందుకు లోక్‌సత్తా పూర్తి సహకారం అందిస్తుందని, విధానాలపై వ్యవస్థాపకులు జేపీకున్న స్పష్టత జగమెరి గినదన్నారు. నిరాశ అక్కర్లేదని, సోషల్ మీడియా సహా ప్రతి అవకాశాన్నీ ప్రతికూలంగా కాకుండా, సానుకూలంగా ఉపయోగించటం నేర్చుకుంటే.. యువతకు కనుచూపు మేరలోనే బోలెడు అవ కాశాలు లభిస్తాయన్నారు. సరైన వ్యక్తుల సామాజిక ఖాతాలను అనుసరిస్తే, వాస్తవాలు అర్థమవుతాయని, విద్వేషం, అసూయ వంటి వాటికి లొంగి అబద్ధాలను అనుసరిస్తే జీవితం చివరి దశలో విలపించాల్సి వస్తుందన్నారు. కెనరా బ్యాంక్ రిటైర్డ్ చీఫ్ ఆఫీసర్ పిచకల ప్రభాకరరావు, చెరువుల పరిరక్షణ సమితి నాయకులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, జాగరపు ఈశ్వర ప్రసాద్, అబ్దుల్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, స్పార్క్ పద్మనాభం, సంతోష్, వెంకటేష్, తాడేపల్లి నాగేశ్వరరావు, పెద్దసంఖ్యలో యువత పాల్గొన్నారు. ✦

# మావోయిస్టుల లొంగుబాటు.. ఎన్నికల్లో అవకాశాలు



20వ శతాబ్దంలో మొదలై ఎన్నో దశాబ్దాలపాటు యువతను, నిరుపేదలను, అణగారిన కులాలను, ఆదివాసీలను, మేధావులనూ ఉర్రూతలూగించిన ఉద్యమం నక్సలిజం. సమాజంలో అన్యాయంపై తిరగబడటానికి నక్సల్ మార్గాన్ని అనుసరించటం, అడవుల్లో తుపాకీ పట్టటం, గెరిల్లా పద్ధతిలో మెరుపుదాడులు చేయటం సమాజంలో ఒక ఆదర్శంగా ఉండేది. ముఖ్యంగా రాజ్యవ్యవస్థ ఏం చేయాలో భారత రాజ్యాంగంలో నిర్దిష్టంగా నిర్వచించకపోవటం వల్ల, వలస పాలకుల ధోరణిలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజల నెత్తినెక్కి తొక్కుతుండటం వల్ల.. బిక్కుబిక్కుమంటున్న, జీవన పోరాటంలో అలసిపోతున్న ప్రజలకు నక్సలైట్లు కాంతి కిరణాల్లా కనిపించారు. చివరికి ఎన్నికల్లో పోటీ చేసే ప్రముఖ పార్టీలు సైతం నక్సలిజాన్ని పొగుడుతూ, వారు గొప్ప దేశభక్తులు అని కీర్తించాయి. కానీ నక్సలైట్లు ప్రజా కోర్టు పేరుతో సమాంతర ప్రభుత్వం నడుపుతూ ప్రజాదరణ గల నాయకులను సైతం కాల్చిచంపి ఆ తర్వాత తీరిగ్గా విచారాన్ని ప్రకటించటం, రాజ్యవ్యవస్థ ఆర్థికంగా బలో పేతమై పేదరిక నిర్మూలన, సంక్షేమ పథకాలను అమలు చేయటం, సాంకేతికత విస్తరించటం, నక్సల్స్ కన్నా అత్యాధునిక ఆయుధాలను ప్రభుత్వాలు వినియోగించటం వంటి కారణాల వల్ల నక్సలైట్ల మనుగడ కష్టమైంది. నక్సల్స్ పట్ల సానుభూతి కలిగిన నేతలు సైతం మావోయిస్టులా, పోలీసులా తేల్చుకోండన్న అల్టిమేటంతో.. పోలీసుల వైపు మొగ్గుచూపక తప్పని పరిస్థితి ఏర్పడింది. పోలీసులులేని జీవితాన్ని ఊహల్లో కూడా చేయలేని రాజకీయం వారిని ధిక్కరించే సాహసం చేయలేకపోయింది. దీనికితోడు, మావోయిస్టులు వ్యూహాత్మకంగా, ఎత్తుగడల పరంగా కన్నా.. సైద్ధాంతికంగా బలహీనపడటం కలిసొచ్చింది.

వివిధ గ్రూపులుగా ఉన్న నక్సలైట్లు మావోయిస్టుల పేరుతో ఏకమైనా, రెడ్ కారిడార్‌ను నేపాల్ దాకా ప్రకటించారు. అయితే కొత్త రిక్రూట్‌మెంట్లు కరువయ్యాయి. రాజ్యాంగం కంటే వేగంగా సమాజంలో మార్పుని తుపాకీ ద్వారా సాధించాలనే వారి ప్రయత్నం రాజ్యవ్యవస్థ ఆయుధబలం ముందు వట్టిపోయింది. వాళ్లు తుపాకీ తీస్తే, ప్రభుత్వ బలగాలు బజూకా, మిసైల్స్ ప్రయోగించాయి. వాళ్లు రాత్రుళ్లు సంచరిస్తూ, రేడియో, వాకీటాకీల్ని ఉపయోగిస్తే..

ప్రభుత్వం రాత్రి విజన్ టెక్నాలజీలను, అత్యాధునిక సమాచార సాధనాల్ని ఉపయోగించింది. మావోయిజం అంశాన్ని కేవలం శాంతిభద్రతల కోణంలో చూడకుండా.. సామాజిక సమస్యగా మూలాల్లోకి వెళ్లి పరిశీలించటం, లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించటం వంటివి మెరుగైన ఫలితాలనిచ్చాయి. తెలుగునాట మొదలైన ఈ నమూనా దేశవ్యాప్తమైంది.

రాజకీయ పార్టీలు ఒక తప్పును సరిచేయలేకపోయినా, ఆ తప్పు వల్ల భారం తగ్గించుకోవటానికి చిన్న తప్పు చేసి మనుగడ సాగించటంలో ఆరితేరారు. ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేయకుండానే, సర్కారీ కార్యాలయాల్లో ప్రజలకు రోజువారీ సేవలు అందించటానికి కొంతమంది కార్యకర్తలని నియోజకవర్గాలవారీగా పోషించటం రాజకీయ సంస్కృతిలో అనివార్య భాగంగా మార్చుకున్నాయి. ఈ నేపథ్యంలో, అడవులకు పరిమితమైన మావోయిజం ఉనికిని చాటుకోవటమే కష్టంగా మారింది. ఏతావాతా ఎత్తుగడలు తప్ప.. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి తక్షణ, దీర్ఘకాల ప్రత్యామ్నాయాన్ని చూపలేకపోవటమనే సైద్ధాంతిక వైఫ ల్యాన్ని పరిష్కరించుకోలేకపోవటంతో మావోయిస్టుల పోరా టంలో వినూత్నత కొరవడింది. ఆ విషయాన్ని 'ఆపరేషన్ కగార్' తర్వాత ఆయుధాల్ని విసర్జించి లొంగిపోయాక మావోయిస్టు నేతలూ అంగీకరించారు.


భారతీయ సమాజంలో, ప్రపంచంలో వచ్చిన మార్పుల్ని విశ్లేషించటం, అందుకు అనుగుణంగా పంథాను మార్చు కోవటంలో విఫలమయ్యామని, ఈ వైఫల్యానికి కచ్చితంగా తమదే బాధ్యతని లొంగిపోయిన సీనియర్ మావోయిస్టులు మీడియా ఇంటర్వ్యూల్లో తెలిపారు. కొందరు మావోయిస్టులు తమను రాజకీయ పార్టీగా గుర్తించాలని, ఎన్నికల్లో పోటీ చేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంకొందరు ప్రజాస్వామ్య బలోపేతానికి పౌర సమాజ సంస్థగా, ప్రజల డిమాండ్లపై ఒత్తిడి తెచ్చే వర్గంగా (ప్రెజర్ గ్రూప్) పనిచేస్తామంటున్నారు. వీరికి మద్దతుగా సమాజంలో ఉన్న ఆలోచనాపరుల్లో ఎక్కువమంది మాత్రం.. మావోయిస్టులు లొంగిపోవటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీచేసినా నక్సల్స్ గెలవలేరని.. ఓటుకు నోట్లు ఖర్చు పెట్టి గెలిచి చట్ట సభల్లోకి వెళ్లటం, అధికారం సాధించటం అసాధ్యమని అంటున్నారు.

అంతర్లీనంగా ఏకసూత్రం, ఏకాభిప్రాయం కలిగిన అంశాలపై కూడా ఎవరి కోణం నుండి వారు సైద్ధాంతికత

**కొందరు మావోయిస్టులు తమను రాజకీయ పార్టీగా గుర్తించాలని, ఎన్నికల్లో పోటీ చేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇంకొందరు ప్రజాస్వామ్య బలోపేతానికి పౌర సమాజ సంస్థగా, ప్రజల డిమాండ్లపై ఒత్తిడి తెచ్చే వర్గంగా (ప్రెజర్ గ్రూప్) పనిచేస్తామంటున్నారు. వీరికి మద్దతుగా సమాజంలో ఉన్న ఆలోచనాపరుల్లో ఎక్కువమంది మాత్రం.. మావోయిస్టులు లొంగిపోవటం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.**

పేరుతో పిడివాదంతో ఆలోచించటం వల్ల, శత్రువును బూచిగా చూపించకుండా వ్యూహాల్ని రచించే శక్తి లేకపోవటం వల్ల ఈ సమస్య ఎదురైనట్లు కనిపిస్తుంది. మావోయిస్టులుగా నక్సల్స్ పేరు మార్చుకుని రెడ్ కారిడార్ ప్రకటన చేసే నాటికే, చైనా మావో పంథాను విడనాడటం వల్ల వేగంగా అభివృద్ధి సాధిస్తోంది, కోట్లమందిని పేదరికం నుండి బయటపడేస్తోంది. అయినా ఆ మార్పును గుర్తిం చటాన్ని నిరాకరించటం వారి ఉద్యమాన్ని తిరోగమనంలోకి నెట్టింది. మావోయిస్టులు సమాజంలో వచ్చిన మార్పుల్ని విశ్లేషించి తగిన రీతిలో కార్యాచరణ చేపట్టడంలో విఫల మవడం ఒక ప్రబల కారణం అనుకోవచ్చు.

మావోయిస్టులతోపాటు.. దళితులు, పలువురు వెనుకబడిన తరగతుల సంఘాలవారు కూడా కమ్యూనిస్టు భావజాలం నుండి మొదలై వేరుకుంపటి పెట్టుకున్నవారే. అస్తిత్వ ఉద్యమాల్లోకి మారినవారే. వీరిలో తమ ఐడెంటిటీ, రిజర్వేషన్లు వంటి వెసులుబాట్ల రీత్యా అంబేద్కర్‌ను, ఆయన రాసిన రాజ్యాంగాన్ని గౌరవించేవారు ఎక్కువగా ఉన్నారు గానీ.. రాజ్యాంగ నైతికతకన్నా ఇప్పటికీ వారిలో ఎక్కువగా మావోయిస్టు, కమ్యూనిస్టు భావజాల ఆందోళనా పద్ధతులే ఎక్కువగా కనిపిస్తుంటాయి. మావోయిస్టులతోపాటు, వారిని సమర్థిస్తూ అర్బన్ నక్సల్స్‌గా కొందరు భావించే మావోయిస్టు మద్దతుదారులు కూడా ప్రజాస్వామ్యాన్నే కోరుకుంటున్నారు. అయితే, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం అమలులోని లోపాల్ని సరిదిద్దే ప్రయత్నం చేసే శక్తి, ఆసక్తిలేక.. మావోయిస్టులను సమర్థించటం ద్వారా వారి త్యాగాల్లో తమకూ వాటా




ఉందన్నట్లు వ్యవహరిస్తున్నారు. 'ఒక పరిధి దాటి ఉత్పత్తి సాధ్యం కాదు, మిగులు విలువ కొందరి సొత్తుగానే మిగిలిపోతుంది, కాబట్టి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ దోపిడీ వ్యవస్థ, పెట్టుబడి పెట్టి రిస్కు తీసుకునేవారు వర్గ శత్రువులు అని చెప్పిన వీరికి – డబ్బు సంపాదించటం పాపం, దైవభక్తికి వ్యతిరేకం అన్న హైందవ సంస్కృతి ఒకటే అవటం కూడా దశాబ్దాలపాటు వారిని వాస్తవాలు గ్రహించనీయకుండా ఏమార్చి ఉండొచ్చు.

ఈ మొత్తం నేపథ్యం నుండి మావోయిస్టులు రాజకీయ పార్టీగా మారటాన్ని మనం చూడాలి. మావోయిస్టులు తమ లోపాల్ని సరిదిద్దుకోవటానికి.. ప్రజాస్వామ్యం; అందులో సోషలిజం, క్యాపిటలిజం ఆర్థిక వ్యవస్థల్లోని మంచిని కలపటం ఎలా; రాజ్యవ్యవస్థ మౌలిక బాధ్యతలేమిటి.. మొదలైన అంశాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఇది పైపైన సాంకేతికంగా జరగకూడదు. అలవాటులో పొరపాటుగా మారకూడదు. హేతుబద్ధత, తర్కం, వాస్తవాలు, సాక్ష్యాలు, నిష్పాక్షికతతో జరగాలి. దశాబ్దాల పర్యంతం విశ్వసించిన భావజాలంలోని మౌలికాంశాలు తప్పనితేలితే నిస్సంకోచంగా మార్చుకోగలిగే సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించాలి. రాజకీయ కృషిలో భాగంగా ఆ రకమైన లక్ష్యాల కోసం రాజ్యాంగబద్ధంగా కృషి చేయాలి.

జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులు ప్రస్తుతానికి భారత ప్రజాస్వామ్యంలో సమస్యల మూలాల్లోకి వెళ్లి సంస్కరణల్ని లోతుగా అధ్యయనం చేయాలి. స్థానిక ప్రభుత్వాల సాధికారత, విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం మొదలైన అంశాల మీద లోతుగా దృష్టి సారించాలి. కానీ స్థానిక ప్రభుత్వాల విలువ అర్థం కావటానికి కొంత సమయం పడుతుంది కాబట్టి.. తక్షణం మార్పు రావటం కోసం దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావాలి. ఆర్థికాభివృద్ధి లేకుంటే ప్రజాస్వామ్యం, చట్ట సమానత వంటివి బూటకమవుతాయి. కాబట్టి, ఆర్థిక విధానాలు, వ్యక్తికి ఆరోగ్యకరమైన స్వేచ్ఛ మొదలైన అంశాల కోసం కృషి చేయాలి.సమ్మిళిత అభివృద్ధి భారత్ కోసం పరిష్కారాల్ని అధ్యయనం చేయటం, ఎన్నికల వ్యవస్థలో లేదా ప్రజల్లో స్వచ్ఛందంగా మార్పు వచ్చేలోగా ఎన్నికలకు అతీతమైన రాజకీయం చేయటం, సమయం వచ్చినప్పుడు ఆయా సంస్కరణల్ని సాధించటానికి కృషి చేస్తూ పరిస్థితులు అనుకూలించి నప్పుడు ఎన్నికల్లో పోటీ చేసి చట్టసభలకు వెళ్లి విధాన నిర్ణయాలను మరింత వేగంగా, ప్రభావశీలంగా అమలయ్యేలా చేయటం.. ఇప్పుడు మావోయిస్టుల ముందున్న సరైన కార్యాచరణ. ✦

## హెచ్.జె దొరకు జేపీ ఘననివాళి

మావోయిస్టు సమస్యలోని సామాజిక కోణాన్నీ తెలియచెబుతూ పరిష్కారానికి ఒక ఆచరణసాధ్య నమూనాను దేశానికి అందించిన పోలీసు అధికారి హెచ్.జె దొర అని జేపీ అన్నారు. వృత్తి నిర్వహణలో అంకిత భావంతో వ్యవహరించిన ఆదర్శప్రాయుడన్నారు. స్పందించే శక్తిని కోల్పోకుండా చివరి వరకూ బాధ్యతల్ని సక్రమంగా, ప్రజలు, ప్రజాప్రతినిధుల పట్ల వినమ్రంగా నిర్వర్తించిన గొప్ప ప్రజాసేవకుడిగా అభివర్ణించారు. ఆయనతో కలిసి తాను ఎక్కువకాలం పనిచేశానని గుర్తుచేసుకుంటూ.. దొరకు జేపీ ఘననివాళులర్పించారు.



# చైనా నుండి నేర్చుకోవాలన్న మంత్రి పీయుష్ గోయెల్



2007లో చైనా ఉన్న స్థాయిలో 2026లో భారతదేశం ఉందని ఇంతకుముందు 'జనబలం' సంచికల్లో చర్చించుకున్నాం. ఒకప్పుడు మనకంటే ఎంతో వెనకున్న చైనా.. ఎదగటం వెనుక ఆర్థికాభివృద్ధి విషయంలో అనుసరించిన సెజ్‌ల ఏర్పాటు, పోటీ, విస్తృత స్థాయిలో లావాదేవీలు, స్వేచ్ఛా వాణిజ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత మొదలైన అంశాల గురించి ప్రస్తావించుకున్నాం. వాటితోపాటు ఆ విధానాన్ని దశాబ్దాలపాటు తదేకంగా కొనసాగించగల నిలకడ వైఖరి కూడా అందుకు దోహదం చేసిందనుకున్నాం. ఇవేకాకుండా..ఒక విధాన నిర్ణయం చేయటంలో, ఆ నిర్ణయం అమలుకి కాల వ్యవధిని నిర్ణయించటంలో, సకాలంలో పూర్తిచేయటంలో నాయకత్వం, పాలనా యంత్రాంగం ప్రదర్శించే ఆచరణాత్మక వైఖరి కూడా చైనా ఆర్థిక విజయాలకు కారణం. ఈ విషయాన్ని యూనియన్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయుష్ గోయెల్ ఇటీవల ఒక బహిరంగ కార్యక్రమంలో ప్రస్తావించారు. ప్యానల్ చర్చలో మంత్రి మాట్లాడుతూ, మౌలిక సదుపాయాల విస్తరణలో భారత్ పొరుగుదేశం చైనా నుండి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. బుల్లెట్ ట్రెయిన్‌ని ఉదాహరణగా ప్రస్తావించారు. చైనా హైస్పీడ్ రైలుని వేల కిలోమీటర్లు వేగంగా విస్తరించి, ఇప్పటికే ప్రారంభించగా..భారత్ ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలుని పూర్తి చేయటానికే ఇంకా 4-5 ఏళ్లు పట్టే అవకాశం ఉందని మంత్రి అన్నారు. 'విస్తరణ ప్రణాళిక, అమలు'లో చైనా భారత్‌కి గురువు అన్నారు.

**అమెరికా కంటే ఫాస్ట్ చైనా**

హైస్పీడ్ రైలు ప్రణాళిక, అమలులో అమెరికా కంటే కూడా చైనా ముందుంది. కాకపోతే, భారత్ కంటే అమెరికా కొంత మెరుగు. చైనా 2008లో బుల్లెట్ రైలు నెట్‌వర్క్ విస్తరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద నెట్‌వర్క్. 40,000 కిలోమీటర్లు. గంటకు ఈ రైళ్లు 300-350 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణిస్తాయి. నిర్మాణం పూర్తికావటం తోపాటు.. రైళ్లు కూడా ఇప్పటికే నడుస్తున్నాయి. ఇందులో కొన్ని మార్గాల్లో ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాల్సి వస్తుండగా, కొన్ని మార్గాల్లో విపరీత డిమాండ్ ఉంటోంది. రాయితీకి, ఆదాయానికి మధ్య సమతూకాన్ని పాటించటంలోనూ చైనా నైపుణ్యం కనిపిస్తుంది. బీజింగ్ నుండి షాంఘైకి 1318 కిలోమీటర్లు ఏడాదికి 200-250 కోట్ల మంది ప్రయాణిస్తుంటారు. ఇందుకోసం వెచ్చించిన 220 బిలియన్ డాలర్లు ఇప్పటికే వసూలైంది. ఇదే అమెరికా కాలిఫోర్నియాలో హైస్పీడ్ రైలుకి 2008లో ఓటర్లు ఆమోదం తెలిపారు. నిర్మాణం 2015లో ప్రారంభమైంది. గంటకు 320 కిలోమీటర్ల గరిష్ట వేగంతో కాలిఫోర్నియా నుండి లాస్‌ఏంజిల్స్‌కి ప్రతిపాదించారు. 33 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని మొదట అంచనా వేయగా, ఇప్పుడు ఆ వ్యయం 100 బిలియన్ డాలర్లకి పెరిగిపోయింది. 2026 వచ్చినా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు.

అదేవిధంగా, యాంగ్జీ నదిపై నిర్మించిన త్రీగోర్జెస్ డ్యామ్. ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రో ఎలక్ట్రిక్ పథకానికి 1992లో చైనీస్ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. 1994లో నిర్మాణం ప్రారంభమైంది. 2003లో మొదటి జనరేటర్ విద్యుదుత్పత్తి ప్రారంభించింది. 2006లో ప్రధాన డ్యామ్ నిర్మాణం పూర్తయింది. 2012 నాటికి మొత్తం పవర్‌ప్లాంట్ నిర్మాణం పూర్తయి, పూర్తిస్థాయి విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. అంటే, 18 ఏళ్లలో పూర్తయింది. ఒక్కొక్కటి 700 మెగావాట్ల సామర్థ్యంతో 32 మెయిన్ టర్బయిన్లు 22,500 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. 600 కిలోమీటర్ల పొడవున్న రిజర్వాయర్ వల్ల వరదలు నియంత్రణలోకి వచ్చాయి. 10,000 టన్నుల సరకు రవాణా ఓడలు ఇందులో ప్రయాణిస్తూ వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. పారిశ్రామిక వృద్ధికి దోహదం చేశాయి. కేవలం 5 ఏళ్లలో పెట్టుబడి తిరిగి వచ్చి, లాభాలు మొదలయ్యాయి.

చైనా హైస్పీడ్ రైలు మార్గం, త్రీగోర్జెస్ డ్యామ్ నిర్మాణాల్ని అమెరికాలోని కాలిఫోర్నియా-లాస్‌ఏంజిల్స్ హైస్పీడ్ రైలు మార్గం నిర్మాణం, తెలంగాణలోని కాళేశ్వరంతో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ్ ఇటీవల కొన్ని ఇంటర్వ్యూల్లో పోల్చి తేడాలను వివరించారు. చైనా, అమెరికా మధ్య తేడా నాయకత్వ దృక్ప థంలో ఉండగా.. చైనా, భారత్ తేడా నాయకత్వ నాణ్యతలో ఉం దని మనం భావించవచ్చు. చైనాలో నాయకులు ఎక్కువగా ఇంజి నీర్లు కాగా, అమెరికాలో ఎక్కువమంది లాయర్లు. చైనా నేతలు నిర్మాణ ప్రణాళికలను క్షుణ్ణంగానే కాదు, వేగంగా అధ్యయనం చేసి ఆచరణలో కూడా అంత కచ్చితత్వాన్ని వ్యవహరిస్తారు. అదే అమెరికాలో మితిమీరిన స్వేచ్ఛకి న్యాయవాదుల వాదోపవాదాల ధోరణి తోడవటంతో..పలు సందర్భాల్లో జాప్యం సాధారణమన్నట్లు జరుగుతుంటుంది. మన దేశంలో కాళేశ్వరం, పోలవరం లాంటివైతే నీళ్లు పారటం కంటే జనం డబ్బు పారుతుంటుంది. నాయకులు, అధికారుల కమీషన్లు అలా వుంచితే.. కాళేశ్వరంలో ఆదాయం కంటే పెట్టుబడి అనేక రెట్లు ఎక్కువ.

హేతుబద్ధత, వాస్తవాలు, సాక్ష్యాలు, ఇతర దేశాల్లోని ఉదాహరణల్ని పరిశీలించి అత్యుత్తమ పద్ధతుల్ని మన పరిపాలనలో అనుసరించటం, ప్రజల డబ్బు ప్రతి రూపాయి సద్వినియోగమయ్యేలా ప్రణాళికలు అమలు చేయటం జేపీ, పీయుష్ గోయెల్ లాంటి వారి మాటల ద్వారా తెలుసుకున్నాకైనా మన దేశంలో పెరిగితే వికసిత్ భారత్ అవకాశాలు మనకు మరింత పెరుగుతాయి.

# వాయిస్ ఆఫ్ ఇండియా, 'పద్మ' పురస్కార గ్రహీతలు
# మార్క్ టుల్లీ, రామారెడ్డిలకు లోక్ సత్తా ఘననివాళులు




ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తన ఇంటి పేరు, ఐఏఎస్ హోదాల్ని ఎప్పుడూ ప్రస్తావించరు. ఆ మాటకొస్తే, ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తాల్ని కూడా అవసరార్ధ వాహనాలుగానే భావిస్తారు.ఈ దేశంలో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం..లక్ష్యంగా మౌలిక సంస్కరణల కోసం 50 ఏళ్లకు పైగా కృషి చేస్తున్న పౌరునిగా గుర్తింపుపొందటానికే ఆయన ఎక్కువ మొగ్గు చూపుతారు. జేపీ కార్యక్షేత్రం తెలుగు రాష్ట్రాలే అయినా.. తన భావాల్ని వెదజల్లేందుకు ఆయన మిగిలిన భారతదేశమంతా పర్యటిస్తుంటారు. అదేవిధంగా వివిధ దేశాల్లో ప్రవాస భారతీయ సమావేశాలలో పాల్గొంటూ, వారి సేవలు భారత్‌లో ప్రజాస్వామ్య సంస్కరణలకు ఉపయోగించే ప్రయత్నం చేస్తుంటారు. అలా ఏదో రాష్ట్రానికి వెళుతూ జేపీ ఎయిర్ పోర్టులో ఉండగా ఇటీవల ఒకామె వచ్చి తన తొమ్మిదేళ్ల కుమార్తెకి ఐఏఎస్‌కు ఎలా ప్రిపేరవ్వాలో టిప్స్ చెప్పమని అడిగిందట. కాస్త తేరుకున్నాక, ఆమెను సున్నితంగా మందలించి.. ఆ పిల్లను హాయిగా మెదడు వికసించేలా బడిలో, బడి బయటి ప్రపంచంలో చదువుకోనివ్వండి అని జేపీహితవు పలికారట. ఆమే కాదు, చాలామంది తల్లిదండ్రులు చదువంటే ఏమిటో తెలియకుండా తమ పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్ వంటివి చదివి అధికార దర్పం ప్రదర్శిస్తూ బోలెడంత డబ్బు సంపాదిం చాలని కోరుకుంటుంటారు. అందుకే ఐఏఎస్‌గా స్వతంత్ర భారతదేశంలో ఎవరూ సాధించనంత గొప్ప విజయాల్ని సాధించినా, ఈ దేశం తన పూర్తి సామర్థ్యాన్ని వికసింప చేసుకుని ప్రపంచస్థాయికి ఎదిగేలా సమ్మిళిత అభివృద్ధి సాధించటానికి అవసరమైన ప్రజాస్వామ్య రాజకీయ, పాలనా, ఆర్థిక, సామాజిక సంస్కరణల కోసం రాజ్యాంగ బద్ధంగా పోరాడుతున్నా.. వాటన్నిటి కంటే ఐఏఎస్‌కు మార్గం చెప్పండనే సాధారణ మధ్యతరగతివారు జేపీని అడుగుతుంటారు. అది కూడా టిప్స్. నవ్వు, జాలి, ఆవేదన కలిగించే అలాంటివారి ధోరణిని అలా వుంచితే.. జేపీ ఐఏఎస్‌కి ఎంపిక కావటానికి ఈ దేశానికి ఏదైనా చేయాలన్న తపన తప్ప ప్రత్యేకించి ఏమీ సన్నద్ధం కాలేదు. ఇందుకు కొంత స్వతస్సిద్ధ మేధ కారణమైనా, బీబీసీ రేడియో కూడా ఇంకో కారణం. ప్రపంచంలో ఏ మూల ఏం జరుగుతుందో, వెంటనే క్షణాల్లో బీబీసీ తెలియచేయటం, రోజులో వీలైనంత ఎక్కువ సమయం ఆ వార్తల్ని వినటం జేపీకి ఐఏఎస్ కి అలవోకగా ఎంపికయ్యే సామర్థ్యాన్నిచ్చింది. అంతర్జాతీయ పరిణామాల్ని విశ్లేషణాత్మంగా చెప్పగలవారిని ప్రపంచంలో ఓ పదిమందిని ఎంపిక చేస్తే, వారిలో జేపీ తప్పక ఉంటారు. అంత పరిజ్ఞానం ఉండబట్టే, అప్పట్లో హైదరాబాద్‌లో మతకలహాల వల్ల రొట్టె ముక్క, టీనీళ్లు లేకపోయినా.. కర్ఫ్యూ పాస్ తో పొద్దుట్నుంచి సాయంత్రం వరకూ వరుసగా ఐఏఎస్ పరీక్షలు రాయగలిగారు. ఆలిండియా టాప్ టెన్ లో ఎంపికవగలిగారు. ఈ అరుదైన ఉదాహరణకి కారకులు కాబట్టే.. బీబీసీ విదేశీ కరస్పాండెంట్, ఢిల్లీ బ్యూరో చీఫ్ మార్క్ టుల్లీ అంటే జేపీకి చాలా అభిమానం. 1935లో ఇప్పటి కోల్ కతాలో జన్మించిన మార్క్ టుల్లీ.. ఆ తర్వాత బ్రిటన్‌కి వెళ్లి కేంబ్రిడ్జిలో చదివారు. 1965లో తిరిగి భారత్‌కి బీబీసీ ఉద్యోగిగా వచ్చారు. 1972 నుండి సుమారు ఇరవై ఏళ్లపాటు బీబీసీ ఢిల్లీ బ్యూరో చీఫ్‌గా పనిచేశారు. ఆయన ఆఫీస్ రూంలో కూర్చుని పనిచేసే, సంస్థ పేరును తన వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకునే రకం జర్నలిస్టు కాదు. ప్రజల్లోకి వెళ్లి విషయాలు సేకరించి వార్తలకి కొత్త

నిర్వచనమిచ్చారు. తన జీవితాంతం బ్రిటిష్ పౌరసత్వాన్ని వదులుకోకపోయినా.. తాను బ్రిటన్, ఇండి యా పౌరుడ్ని అని సగర్వంగా చెప్పుకునేవారు. ఒక 'నిజమైన జర్నలిస్టుగా పని చేయదగిన గొప్ప దేశం భారత్' అని శ్లాఘించారు; వాయిస్ ఆఫ్ ఇండియాగా తన జీవితాన్ని అంకితభావంతో వెచ్చించారు.

అప్పట్లో భారతదేశం అంటే ఏమిటి?.. కొద్దిమంది మినహాయిస్తే, మిగతావారంతా పేదరికాన్ని, కులాన్ని, వర్గాన్ని పాటిస్తూ, డబ్బు సంపాదన పాపమన్నట్లు భావించే వెనుకబడిన, అల్పాదాయ దేశం. వాటి మూలాల్లోకి వెళ్లి, ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా, పరిష్కారాల్ని అర్థ మయ్యేలా సమాజానికి–పాలకులకు వారధిగా వ్యవహరించే ప్రయత్నం మార్క్ చేశారు. నిజాయతీగా, నిశిత విశ్లేషణతో వార్తలు చెప్పటమే కాదు.. వేగంగా వార్తల్ని సేకరించి అందించటం మార్క్ ప్రత్యేకత. బీబీసీ వరల్డ్ సర్వీస్, ఫ్రమ్ అవర్ కరస్పాండెంట్ పేరుతో మార్క్ టుల్లీ స్వయంగా వినిపించే వార్తల్ని తెలుసుకోవటానికి చాలామంది ప్రపంచవ్యాప్తంగా ఎదురుచూసేవారు. ఒక పల్లెటూరులో, విద్యుత్ సదుపాయం కూడా లేని ఇంట్లో ఉంటూ, పూరిపాక లాంటి స్కూల్లో సంవత్సరం పాఠాలు మొత్తాన్నీ వారంలోగా పూర్తి చేసి మరీ జేపీ బీబీసీ వినటం మాత్రం గొప్ప విశేషమే. తన మేధోవికాసానికి దోహదపడిన విలువైన ఉపాధ్యా యులతోపాటు మార్క్ టుల్లీని కూడా జేపీ అందుకే అంత గౌరవిస్తారు. ఆ మార్క్ టుల్లీ జనవరి 25, 2026న ఢిల్లీలో తొంభై ఏళ్ల వయసులో మరణించటం ఒక బాధాకర విషయమైతే, అదేరోజు తాను ఎంతో గౌరవించి అభి మానించే సహకార సంఘాల ఉద్యమకారుడు మామిడి రామారెడ్డికి మరణానంతరం 'పద్మ' పురస్కారం రావటం ఒక సంతోషకర విషయం.


పెన్షన్ వచ్చే వ్యవధి వరకూ కూడా వేచి చూడకుండా దేశం కోసం ఐఏఎస్‌కి రాజీనామా చేసిన జేపీ.. ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తా స్థాపించే ముందు ఢిల్లీ వెళ్లేటప్పుడు రామారెడ్డి కూడా వెళ్లారు. వారు కలుసుకున్న వారిలో మార్క్ టుల్లీ ఒకరు. ఆ తర్వాత కూడా సహకార సంఘాల స్వయం ప్రతిపత్తికి జేపీ 97వ రాజ్యాంగ సవరణ తేవటంలో వర్గీస్ కురియన్ తోపాటు రామారెడ్డి కీలక పాత్ర పోషించారు. ఇందుకు 1995లో ఎన్.టి.ఆర్ హయాంలో జేపీ కార్యదర్శిగా ఉన్నప్పుడు 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘం) చట్టం తేవటంలో కృషి చేసిన అనుభవం రామారెడ్డికి ఉపకరించింది. ఇక లోక్‌సత్తా ఏర్పడ్డాక, సహకార సంఘాల స్వయంప్రతిపత్తిని కాపాడటం నుండి స్థానిక ప్రభుత్వాల సాధికారత వరకూ.. 'రాజ్యం కంటే పౌరులు ముఖ్యం, పౌరుని చుట్టూ పాలనే నిజమైన సుపరిపాలన' అనే సిద్ధాంతానికనుగుణంగా లోక్‌సత్తా కృషిలో భాగమయ్యారు. 'ప్రజలే ప్రభువులు–పాలకులు సేవకులే' అన్న లోక్ సత్తా భావజాలంతో మమేకమయ్యారు.

ఇంకో ఆసక్తికర విశేషం కూడా ఉంది. జేపీ జీవిత గమనాన్ని ఎమర్జెన్సీ మలుపుతిప్పితే.. ఉస్మానియాలో పీజీ తర్వాత విదేశాల్లో సహకార ఉద్యమం, అమెరికాలోని ప్రిన్స్ టన్ యూనివర్సిటీలో స్థానిక ప్రభుత్వాల గురించి అధ్యయనం చేసి తిరిగి వచ్చాక 1967లో హైదరాబాద్ రాజేంద్రనగర్ సర్పంచ్‌గా, ఆ తర్వాత సమితి అధ్యక్షుడిగా పనిచేసిన రామారెడ్డి – 1975లో ఎమర్జెన్సీకి కొద్దికాలం ముందే సహకార అభివృద్ధి సంస్థ (సీడీఎఫ్)ను స్థాపించారు. మార్క్ టుల్లీ కూడా ఎమర్జెన్సీ సమయంలో 24 గంటల నోటీస్ తో దేశ బహిష్కరణకు గురయ్యారు. పలుమార్లు భారత్‌లో దాడులకు గురైనా, బహిష్కరణ ఎదురైనా ఆయన మళ్లీ మళ్లీ భారత్ కే వచ్చి తన సేవలందించారు. యుద్ధాలు, కరవులు, ఎమర్జెన్సీ, అమృత్ సర్ స్వర్ణ దేవాలయంపై సైనిక దాడి చేసిన ఆపరేషన్ బ్లూస్టార్, ఇందిర హత్య, హింసాత్మక దాడులు, ఆర్థిక సంస్కరణలు.. ఇలా పలు కీలక ఘటనల్ని, మలుపుల్ని మార్క్ రిపోర్ట్ చేశారు. 'ఇండియా ఇన్ స్లో మోషన్' అనే పుస్తకంలో భారత్ ఎదగాల్సినంత వేగంగా ఎదగటం లేదన్న వాస్తవాన్ని నిశిత అంతర్లీన విమర్శతో వివరించారు.

భారత్ లాంటి అపార వైవిధ్యమున్న దేశంలో వేగంగా మార్పు అనుకోని ప్రమాదాలకు దారితీస్తుందని కొందరు వాదిస్తుంటారు. కానీ మన నత్తనడక కొన్ని కోట్ల మంది బిడ్డల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నప్పుడు, అదేమి వాదన? ఇలాంటి నైతిక జడత్వం చాలా ప్రమాదకరమని రాజ్యాంగ రచనా సంఘం సారథిగా డాక్టర్ అంబేద్కర్ చాలా స్పష్టంగా హెచ్చరించారు. మార్క్ అదే మార్గాన్ని జర్నలిస్టుగా అనుసరించారు. కాస్త బాధ్యతగా ఆలోచిస్తే.. ఏ తుపాకీ, ఏ నిరంకుశ పాలనా అవసరం లేకుండానే, భారత్‌లో చాలా వేగంగా మౌలిక మార్పుల్ని తెచ్చి అందరికీ ఎదిగే అవకాశాల నివ్వటంలో భాగమవ్వొచ్చని నమ్మారు. భారతీయుల అంతర్గత శక్తి ప్రపంచంలో ఏ గొప్ప దేశ ప్రజానీకానికీ తీసిపోనిది. పెద్ద నోట్ల రద్దులాంటి విధ్వంసకార తొందర పాటును అలవోకగా అధిగమించిన దేశమిది అని మర్చి పోవటం క్షమార్హంకాని సామాజిక, మేధోకపటత్వం అవు తుంది. ఆచరణసాధ్యమైనవి, వెంటనే జరిగే మంచి పనులు కూడానెమ్మదిగా జరగాలంటే.. ఆలస్యం అమృతం విషం!

1990ల్లో భారత్‌లో ఆర్థిక సంస్కరణల తర్వాత బీబీసీ నాణ్యతా ప్రమాణాలతో విభేదించి మార్క్ రాజీనామా చేశారు. భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో మార్క్ టుల్లీని గౌరవించగా, బ్రిటన్ ప్రభుత్వం కూడా ఆయన జర్నలిజం కృషికి నైట్ హుడ్ గౌరవంతో'సర్' బిరుదునిచ్చింది. ఎఫ్.డీ.ఆర్ కృషికి ప్రత్యక్షంగా, పరోక్షంగా స్ఫూర్తినిచ్చిన జేపీ హీరోలుగా ధృవతారలుగా వెలుగొందుతున్న 'పద్మ' పురస్కార గ్రహీతలు మామిడి రామారెడ్డి, మార్క్ టుల్లీలకు సహకార, స్థానిక ప్రభుత్వాల ఉద్యమకారులు, భారతీయ సమాజం తరపున లోక్ సత్తా ఘననివాళులర్పిస్తోంది. ✦

# రూ.3,24,234 కోట్లతో తెలంగాణ 2026 వార్షిక బడ్జెట్



**ప్రతి ఆర్థిక సంవత్సరంలో జీ.ఎస్.డీ.పీ వృద్ధి రేటుతో సమానంగా 10% దాకా అధికంగా ఉండే తెలంగాణ వార్షిక బడ్జెట్ 2026-27లో గతేదాది కంటే 6-7% ఎక్కువగా ఉంది.సంక్షేమాన్ని మాత్రం జీ.ఎస్.డీ.పీ వృద్ధి రేటుతో సమానంగా పెంచారు. సంక్షేమ పథకాల భారమే సగానికి సగం బడ్జెట్ వ్యయంలో ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం కాకున్నా.. ఆర్థిక ఒడిదుడుకులు కొనసాగుతున్నాయని స్పష్టమవుతుంది. సంక్షేమం పేరుతో హామీ ఇచ్చిన తాత్కాలిక వ్యక్తిగత పథకాల అమలును అభివృద్ధితో సమతూకం ఇప్పటికీ సాధ్యంకాక అప్పుల మీదే ఆధారపడి రెవెన్యూ మిగులు చూపారు. రోజువారీ ఖర్చుల భారం పోగా, అప్పుల డబ్బుతోనే రాష్ట్రం నడపాల్సింది. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాల శిక్షణ వంటి అంశాలకు అదనంగా కొన్ని పథకాలను ప్రకటించి కేటాయింపులు పెంచటం సానుకూల పరిణామమే అయినా, వాటి రూపకల్పనలో అనుసరించిన తాత్కాలిక వైఖరుల వల్ల ఏ మేరకు ఫలితాలు వస్తాయనేది సందేహాస్పదం. మూలధన వ్యయం కొంత పెంచటం సరైన దిశలో ప్రయత్నం.**

రూ.3,24,234 కోట్లతో తెలంగాణ 2026-27 బడ్జెట్ ను ఆర్థిక మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,34,405 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లు. ద్రవ్య లోటు రూ.58,458 కోట్లు కాగా, రెవెన్యూ మిగులు రూ.6,857 కోట్లు.

రాష్ట్ర జనాభా మొత్తానికీ వర్తింపచేసే ప్రమాద జీవితబీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్ లో ప్రకటించారు. ప్రతి ఇంటికీ రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వర్తింపచేస్తారు. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తామన్నారు. కొత్తగా ప్రారంభించిన అడ్వాన్స్ డ్ ట్రైనింగ్ సంస్థ (ఏటీసీ)ల్లో చేరేవారికి నెలకు రూ.2వేల ఉపకార వేతనం ఇవ్వాలనే మరో సానుకూల పథకం ప్రకటించారు. ఈ సంస్థల్లో చేరినవారు.. వృత్తి నైపుణ్యాలు సంపాదించగలిగితే వారికి ఉద్యోగాలు రావటం లేదా స్వయం ఉపాధి సంస్థల ఏర్పాటుతో జీవనోపాధికి అవసరమైన మార్గం కల్పిస్తారు.

☞ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను అన్ని వనరులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మారుస్తారు. వీటిల్లో ప్రీ ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు విద్య అందుతుంది.

☞ ప్రీ ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తారు. ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తారు.

☞ ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్య సేవలను అందించే ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తారు.

☞ రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణ అందించటానికి, వారికి ఉపాధి లభించిన దేశాల భాషను నేర్పించటానికి ఉద్దేశించిన సీఎం ఓవర్సీస్ ఎంప్లాయ్ మెంట్ ప్రోగ్రాంను ప్రకటించారు.

☞ అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు భారీ కేటాయింపులు చేశారు.

☞రాష్ట్రవ్యాప్తంగా రవాణా సదుపాయాలు, రోడ్లు మెరుగుపరిచేందుకు చర్యలు.

☞మూసీ కాలుష్యం నుండి రాజధానివాసులకు విముక్తి కల్పించేందుకు 'మూసీ రివర్ ఫ్రంట్'.

☞మెట్రో విస్తరణ రెండో దశ పనులకు నిధుల కేటాయింపు.

☞ రాష్ట్ర ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్ తో డిజిటల్ హెల్త్ కార్డులు అందచేసే కార్యక్రమం.

**సంక్షేమ పథకాలకు 44.50%**

గత బడ్జెట్ లో అన్ని రకాల సంక్షేమ పథకాలకు కలికి రూ.1.04 లక్షల కోట్లు కేటాయించగా, ఈ పద్దు కింద రూ.1,45,591 కోట్లను ప్రతిపాదించారు. గత బడ్జెట్ కంటే ఇది 10% అదనం. మొత్తం 69 రకాల సంక్షేమ పథకాలను



వివిధ శాఖలలో అమలు చేస్తున్నారు.

**మూలధన వ్యయం రూ.9 వేల కోట్ల మేర పెంపు**

పెట్టుబడి వ్యయాన్ని ప్రభుత్వం రూ.36,504 కోట్ల నుండి రూ.47,267 కోట్లకు పెంచింది. సుమారు 29.04% అదనం. మొత్తం 28 ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు వీటిని వెచ్చిస్తారు.

**గత బడ్జెట్ లో ఆదాయం తగ్గినా..**




గత బడ్జెట్ లో వేసిన రూ. 3.04 లక్షల కోట్ల అంచనాల కన్నా ఆదాయం రూ.23,626 కోట్లు తగ్గింది. దీనిప్రకారం సవరించిన అంచనాలతో ఈ ఏడాది బడ్జెట్ ఆదాయం రూ.2.81 లక్షల కోట్లకు తగ్గిపోయింది. అయినా ప్రభుత్వం మరిన్ని భారీ ఆదాయ లక్ష్యాలతో.. సుమారు రూ.43 వేల

**శాఖలవారీగా కేటాయింపులు (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| ఆర్థిక శాఖ : | 60,438 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి : | 33,688 |
| ప్రాథమిక, ఉన్నత విద్య : | 26,674 |
| వ్యవసాయం, సహకారం : | 23,179 |
| నీటిపారుదల : | 22,615 |
| పురపాలక, పట్టణాభివృది: | 17,907 |
| వైద్యం, ఆరోగ్యం : | 13,679 |
| ఇంధన : | 21,285 |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం: | 12,511 |
| హోం: | 11,907 |
| ఎస్.సి కులాల అభివృద్ధి : | 11,784 |
| రోడ్లు, భవనాలు : | 8,298 |
| ప్రణాళిక : | 7,981 |
| గిరిజన సంక్షేమం : | 7,937 |
| గృహ నిర్మాణం : | 7,430 |
| పౌర సరఫరాలు : | 7,366 |
| రవాణా : | 4,491 |
| రెవెన్యూ : | 4,020 |
| మైనారిటీ సంక్షేమం: | 3,769 |
| పరిశ్రమలు, వాణిజ్యం : | 3,747 |
| మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమం: | 3,143 |
| న్యాయ : | 2,306 |
| యువజన, పర్యాటక, సాంస్కృతిక : | 2,127 |
| పశు సంవర్ధక, మత్స్య : | 1529 |
| సాధారణ పరిపాలన : | 1190 |
| పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక : | 1049 |
| కార్మిక, ఉపాధి కల్పన : | 998 |
| ఐటీ : | 875 |

కోట్లు బడ్జెట్ ను పెంచింది.

**ఆదాయం.. ఎందులో పెరగొచ్చు?**

పన్నుల ద్వారా రూ. 14 వేల కోట్లు, యూనియన్ నుంచి వచ్చే గ్రాంట్లలో రూ. 13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ. 6,412 కోట్లు, యూనియన్ పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ. 3,710 కోట్లు, కొత్త రుణాలు రూ. 5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం అంచనాలు చెప్పింది. కానీ ఇవి గ్యారంటీ అని ఇప్పుడే చెప్పలేం. ఉదాహరణకు, సమాఖ్య ప్రభుత్వం నుండి వచ్చే గ్రాంట్లు గత కొన్నేళ్లుగా సగానికి సగం మాత్రమే వచ్చాయి. గత బడ్జెట్ లో రూ. 22,782.50 కోట్లు లెక్కేసుకోగా, రూ. 11,161 కోట్లు మాత్రమే వచ్చాయి.

**కొత్త రుణాలే ఆధారం**




తెలంగాణ ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీలు, రెవెన్యూ ఖర్చులకే పోతున్నందున.. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు అప్పులే ఆధారం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ నుంచి రూ. 64,539 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. రూ. 67,539 కోట్లు తీసుకున్నారు. వచ్చే ఏడాది బహిరంగ మార్కెట్ సహా ఇతర మార్గాల్లో రూ. 82,870 కోట్లు సేకరించాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. కొత్త రుణాలు తీసుకోకపోతే, అన్ని మార్గాల్లో వచ్చే ఆదాయం పూర్తిగా వసూలైనా.. కేవలం రూ. 2.41 లక్షల కోట్లు మాత్రమే.

**జీ.ఎస్.డీ.పీ పెరుగుదలతో ఆశలు**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్నా.. రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీ.ఎస్.డీ.పీ) గతేడాది 10.6 శాతం నుండి 10.7%కి పెరిగింది. జాతీయ సగటు వృద్ధి రేటు 9.8 నుంచి 8%కి తగ్గినా, రాష్ట్రం నిలకడగా పెరగటం ఊరటనిస్తోంది. ప్రస్తుత తెలంగాణ జీ.ఎస్.డీ.పీ రూ. 17.52 లక్షల కోట్లు. ఈ పెరుగుదల వల్లే వచ్చే ఏడాది రుణాలు అదనంగా రూ. 5,325 కోట్లు తీసుకునే అవకాశముందని ప్రభుత్వం వివరించింది.

**పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు సముచిత స్థానం**

బడ్జెట్‌లో పల్లెకు సముచిత స్థానమే లభించింది. 2026×27

**ఆరోగ్యశాఖకు నిధుల కేటాయింపు ఇలా.. (రూ. కోట్లలో)**

| అంశం | నిధులు |
|---|---|
| ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సచివాలయం | 6,29.00 |
| డీఎంఈ | 3,018.94 |
| డైరెక్టర్ ఆఫ్‌పబ్లిక్ హెల్త్ | 5,52.49 |
| కుటుంబ సంక్షేమ కమిషనర్ | 1,844.04 |
| ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌ప్రివెంటివ్ మెడిసిన్ | 0.61 |
| ఆయుష్ హెచ్‌వోడీలు | 155.24 |
| డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ | 2.10 |
| మెడికల్, హెల్త్ సర్వీస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ | 4.80 |
| హైపవర్ కమిటీ | 95.28 |
| ఎంఎన్‌జే అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ | 66.00 |
| ఔషధ, సుగంధ మొక్కల బోర్డు | 1.00 |
| వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల అప్‌గ్రేడేషన్ | 170.00 |
| నిమ్స్ | 5.43 |
| నిమ్స్ అత్యవసరాల పరికరాలకు | 4.95 |
| టీవీవీపీ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల పరికరాలకు | 37.13 |

వార్షిక బడ్జెట్‌లో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రాధాన్యత క్రమంలోనే రూ. 33.68 కోట్లు (గతేడాది కేటాయింపులతో పోల్చితే రూ. 2,083 కోట్లు అధికం) ప్రతిపాదించింది. ఈ శాఖకు 2025–26 రూ. 31,605 కోట్లు కేటాయించారు. మొత్తం రూ. 3.24 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయించినది 10.39%గా ఉంది.

**వైద్యం, ఆరోగ్యానికి గతేడాదికి కన్నా అధికంగా కేటాయింపు**



వార్షిక బడ్జెట్‌లో ఈసారి వైద్య, ఆరోగ్యశాఖలకు ప్రభుత్వం భారీగానే నిధులు కేటాయింది. గత బడ్జెట్‌తో పోలిస్తే సుమారు 10శాతం నిధులు పెంచింది. 2025–26లో ఆరోగ్య శాఖకు రూ. 12,393 కోట్లు ప్రతిపాదించగా తాజా బడ్జెట్‌లో రూ. 13,679 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆరోగ్యశ్రీ కోసం రూ. 1,143 కోట్ల మేర ప్రభుత్వం కేటాయింపులు చేసింది. ప్రగతి పద్దు కింద కేటాయించిన 6,695 కోట్లను ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సౌకర్యాలు, పథకాల అమలుకు వినియోగించనుంది.

# రూర్బన్ పంచాయతీలు, చిన్న పట్టణాల అభివృద్ధితోనే నిజమైన 'జనాభా నిర్వహణ'

యూనియన్ బడ్జెట్ 2026-27లో రూ.1 లక్ష కోట్లతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ని ప్రకటించారు. అభివృద్ధికి పట్టణీకరణ కీలకమైనా, మన దేశంలో ఆ పరివర్తన చాలా నెమ్మదిగా సాగుతోంది. అది కూడా ప్రణాళిక లేకుండా. దక్షిణాఫ్రికా మన కంటే ఎక్కువ పట్టణీకరణను సాధించింది. సమస్యలున్నా..అక్కడ ప్రధాన నగరాలు నిర్మాణంలో క్రమత్వం కలిగివుంటాయి.

ఈవేళ మన దేశంలోని సుమారు 60-65% గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. కానీ వీరి ఆదాయం జీడీపీలో 46% మాత్రమే. అంటే, తలసరి ఆదాయంగా మనం పేర్కొనే పరిధిలోకి వచ్చేవారి సంఖ్య కూడా పరిమితమే. భారతదేశం 2047 నాటికి లక్ష్యంగా ఏర్పరచుకున్న 30 ట్రిలియన్ డాలర్ల జాతీయాదాయం లక్ష్యాన్ని నెరవేర్చాలంటే, వ్యవసాయ రంగం మీద ఒత్తిడిని తగ్గించి ఇతర వృత్తులకి మళ్లించటం అవసరం. అప్పుడే సమ్మిళిత అభివృద్ధి సాధ్యం. తలసరి ఆదాయానికి సమానావకాశాలు సాధ్యం.

దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు కార్మికశక్తిలో తక్కువగా ఉండటం వల్ల కూడా మన ఆర్థిక వ్యవస్థ ఆ మేరకు నష్టపోతోంది. వారి సంఖ్య ఇటీవలికాలంలో కొంత పెరుగుతున్నా.. వారిలో ఎక్కువమంది వ్యవసాయంలో ఉండటం వల్ల లాభం కంటే నష్టం ఎక్కువగా కొనసాగుతోంది. మహిళలకు నగదు బదిలీ స్కీమ్‌లు ఈ నేపథ్యంలోనే ఎన్నికల్లో గెలిపించే ఫార్ములాల్లో ఒకటిగా మారింది. కాబట్టి వ్యవసాయరంగం మీద ఒత్తిడిని తగ్గించటం అంటే.. మహిళల్ని కూడా పట్టణ ప్రాంత వృత్తులోకి పెద్దసంఖ్యలో మళ్లించటం. వారి ఆదాయాల్ని పెంచటం, ఆర్థిక స్వావలంబన కలిగించటం. ఇందుకు తగ్గట్లు పట్టణీకరణకు ఏర్పాట్లు జరగాలి.

పట్టణీకరణ ఆవశ్యకతను ప్రభుత్వాలు గుర్తించినా స్పందన చాలా పేలవంగా ఉంది. ఢిల్లీలో కాలుష్యం పెరిగాక గానీ, మన దేశంలోని రాజకీయ ప్రముఖులకు, సంపన్న వర్గాలకు కొంత జ్ఞానోదయం కాలేదు. ఆ తర్వాత కాలుష్య నివారణకు హైదరాబాద్ సహా కొన్ని మహానగరాల్లో ఏర్పాట్లు చేసి వందల కోట్లు ఖర్చు చేసినా.. వాటి ద్వారా ఒక్క మిల్లీ గ్రాము కూడా కాలుష్య నివారణ జరగలేదని అంచనా సమీక్షల్లో తేలింది. గాలిలో ధూళి కణాలు తగ్గాలంటే, స్ప్రింక్లర్ల ద్వారా నీళ్లు జల్లటం వంటి చిట్కాలను అమలు చేస్తే ఇంక కాలుష్యం ఎలా తగ్గుతుంది? 2014లో నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక, పట్టణీకరణ మీద దృష్టి సారించారుగానీ.. ఇదే తరహా మూస విధానాలు. నగరాల్లో మౌలిక వసతులు అధ్వాన్నంగా ఉండటం, ప్రణాళిక లేకుండా నిర్మాణాలు, అధ్వాన్న పౌర సేవలు వంటి సమస్యలు కొనసాగుతున్నా.. వాటి మీదే రంగులద్దే 'స్మార్ట్ సిటీస్' (అమృత్) పథకాన్ని తీసుకొచ్చారు. స్థానిక ప్రభుత్వాలకు అధికారాల్ని, నిధుల్ని ఇచ్చి జవాబుదారీతనంతో వ్యవహరించే ఏర్పాటు చేస్తే ఆ నిధులు



సద్వినియోగమయ్యేవి. కానీ అధ్వాన్న మౌలిక వసతులపై జిలుగులు అద్దటం వల్ల ఆ పథకం ఆశించిన ఫలితం సాధించలేదు.

కొవిడ్ తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. అప్పటిదాకా అసలు దేశంలో ఎంతమంది వలసలు వెళ్తున్నారు, వారిలో తాత్కాలిక, సీజనల్ వలసలు, వారి జీవితాలు ఎలా ఉన్నాయి, ఓటు హక్కును వినియోగించుకుంటున్నారా? వంటి గణాంకాలు కూడా ప్రభుత్వాల వద్ద లేవు. ఈ వలసల్లో కొంతభాగం వ్యవసాయ పనులకు సంబంధించినవి ఉన్నా, ఎక్కువగా మహా నగరాలకు సాగినవే. కొవిడ్ ఉధృతి సమయంలో కాలినడకన వందల కిలోమీటర్ల మేర వలస కార్మికులు నడిచివెళ్లటం ప్రభుత్వాల్ని, సమాజాన్ని కొంత కదిలించింది. మొదటిసారిగా, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని గుర్తించి అందుకనుగుణంగా పట్టణీకరణ ప్రణాళికల్లో ప్రాథమ్యాల్ని రూపొందించనారంభించారు.

గత పుష్కరకాలంలోనే పట్టణీకరణ కోణంలో వచ్చిన జాతీయ స్థాయి పథకాల్ని పరిశీలిస్తే.. స్మార్ట్ సిటీస్ (2015), గతిశక్తి ప్రణాళిక (2021), నీతి ఆయోగ్ రూపొందించిన 'సిటీ గ్రోత్ కేంద్రాల' నమూనా (2023), 2025లో ప్రకటించి 2026 బడ్జెట్‌లో నిధులు కేటాయించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కీలకమైనవి. వీటికి తోడు శ్యామాప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్, స్వచ్ఛ భారత్, గృహ నిర్మాణ పథకాలు వంటివి కొంత మేర పట్టణాభివృద్ధిలో భాగంగా పరిగణించవచ్చు. ఇలా మొత్తం గా మోదీ ప్రభుత్వమే రూ. 7-9 లక్షల కోట్లు ఈ పథకాలకు నేరుగా కేటాయించటం, రాష్ట్రాల వాటాలు కొంత, ప్రయివేటు సంస్థల నుండి సేకరించటం వంటి మార్గాల్లో వెచ్చించిందని అంచనా. కానీ ఆశించిన ఫలితాలు ఇంకా సుదూరంగా, ఎంత కాలం పడుతుందో ఎవరూ అంచనావేయలేనిరీతిలో ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఆర్థిక వనరుల్లోకన్నా.. మన దృక్పథం, ప్రణాళికల్లోనే ఉంది.

వ్యవసాయం చేయాలని, గ్రామాల్లోనే ఉండాలని అనుకుంటున్నవారు ఈవేళ చాలా తక్కువమంది. పట్టణ సౌకర్యాల్ని ప్రజల్లో ఎక్కువమంది స్వచ్ఛందంగా కోరుకుంటున్నారు కాబట్టి..

ప్రభుత్వం సరైన ప్రణాళికతో, మన దేశ పరిస్థితులకనుగుణంగా వినూత్నంగా ఆలోచిస్తే తేలిగ్గా సమస్యను పరిష్కరించవచ్చు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశాన్నికున్న సమయం తక్కువ కాబట్టి వేగం కూడా అవసరం. మిగిలిన ప్రయోజనాలతో సంధానం చేస్తూ సమగ్ర ప్రణాళిక వేయగలిగితే.. తక్కువ ఖర్చుతో అత్యధిక ఫలితాలు వస్తాయి.

ఇప్పటికీ మన మనసుల్లో పట్టణీకరణ అంటే.. మహానగరాలు, అక్కడికి వలస వెళ్లటమే అనే భావం ఉంది. దాన్నుంచి బయట పడాలి. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చెప్పిన రూర్బన్ (రూరల్+అర్బన్ సదుపాయాలు) కాన్సెప్ట్ ఆదర్శవంతమైనదే అయినా.. అది ఆచరణలో మన దేశం ఉన్న పరిస్థితుల్లో అసాధ్యం. భారత్‌లో సుమారు 6 లక్షల గ్రామాలున్నాయి. 15 లక్షలకు పైగా ఆవాసాలున్నాయి. వీటన్నిటిలో పట్టణ వసతుల్ని కల్పించటం అసాధ్యం. ప్రపంచంలో అత్యంత సంపన్న దేశాలు కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేయలేవు. కలాం ఆలోచనలో కొన్ని మార్పులు చేసి.. పంచాయతీలకి, మహానగరాలకి మధ్య వారధిలా 'చిన్న పట్టణాలను' ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం మేలు.

కొన్ని గ్రామాల మధ్య, అక్కడి ప్రజలు గంటలోపు వెళ్లి తిరిగి వెంటనే రాగలిగే విధంగా ఒక పెద్ద ఊరుని లేదా పట్టణ వాతావరణమున్న ప్రాంతాన్ని ఎంచుకొని, చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. ఇప్పటికే ప్రతి గ్రామంలోనూ, ఆవాసంలోనూ మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇంటర్నెట్ సేవలు వంటి ఆధునిక వసతులున్నాయి. కాబట్టి, గ్రామాలను చిన్న పట్టణాలతో సంధానించటం పెద్ద కష్టం కాదు. భారత్ మొత్తం మీద నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించుకుని, ఓ 5,000 చిన్న పట్టణాలను అభివృద్ధి చేయవచ్చు. అంటే, దాదాపు ప్రతి నియోజకవర్గంలో ఓ పట్టణం ఉంటుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి పెంచవచ్చు.

ఈ చిన్న పట్టణాలు పర్యావరణహిత సాంకేతికతతో, నాణ్యమైన పాఠశాల, ఫ్యామిలీ డాక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆస్పత్రి, ప్రణాళికాబద్ధంగా రోడ్లు తదితర మౌలిక వసతులు, రవాణా సదుపాయాలు, వ్యవసాయాధారిత సహా తయారీరంగ పరి శ్రమలకు తగిన ప్రోత్సాహకాలతో ఉంటాయి. ప్రభుత్వం తొలిదశలో కొద్దిపాటి పెట్టుబడులు వెచ్చిస్తే.. మిగిలినది ప్రయివేటు, కార్పొరేట్ వర్గాలు చూసుకుంటాయి. స్థానికంగానే అధికారాలు, నిధుల్ని గణనీయంగా ఖర్చు చేసేలా ప్రజా ప్రతినిధులకు సాధికారతనిస్తే.. తక్కువ నైపుణ్యమున్నవారు, వారిలోనూ అత్యధికులు మహిళలు చాలా సులభంగా ఆదాయాలను పెంచుకోగలుగుతారు. ఉదయం కార్యాలయానికి రావటం, ఆ చిన్న పట్టణంలో ఉపాధి, ఇతరత్రా పనులు చూసుకుని, సాయంత్రానికి ఇంటికి చేరుకోవటం. ఊళ్లో పొలం ఉంటే వ్యవసాయమూ చూసుకోవచ్చు, పొదుపు చేయగలిగినంత ఆదాయం లభిస్తుంది, అంతా తెలిసినవారు, బంధుమిత్రులు ఉంటారు. జీవితాన్ని హాయిగా ఆస్వాదించవచ్చు. సాంకేతికత ద్వారా ప్రపంచంలో ఎక్కడికైనా తమ నైపుణ్యాల్ని, కొత్త ఆలోచనల్ని చేరవేయవచ్చు. పోటీపడగలిగే శక్తియుక్తులుంటే, మహానగరాలకూ వెళ్లి మరింత ఆదాయం సంపాదించుకోవచ్చు.

**ఏపీలో రూర్బన్ పంచాయతీలు ఒక సానుకూల పరిణామం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌లో తన వంతు వాటాను సద్వినియోగం చేసుకోవాలనుకోవటంతోపాటు.. నిర్ణీత జనాభాపైబడిన గ్రామాలను పట్టణీకరించాలనే కార్యక్రమానికి 2026 మార్చిలో ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా పంచాయతీలను పునర్ వర్గీకరించి 10 వేలకు పైగా జనాభా, రూ.కోటి కంటే ఎక్కువ వార్షికాదాయం, గిరిజన ప్రాంతాల్లో 5వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలను రూర్బన్ పంచాయతీలుగా పరిగణిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతిపాదించింది. ప్రతి గ్రామాన్నీ రూర్బన్ వసతులతో అభివృద్ధి చేయాలనుకోకుండా.. కొన్ని ప్రమాణాలతో పట్టణ సదు పాయాలు కల్పించటం చిన్న పట్టణాల అభివృద్ధి దిశగా మంచి అడుగు.

**జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజున ప్రారంభం**

ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజున 359 రూర్బన్ పంచాయతీలను ప్రారంభించనున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. పంచాయతీల్లో మొదటిసారిగా గెజిటెడ్ అధికారిని పాలనాధికారిగా నియమిస్తారు. పట్టణ తరహా పాలన, మౌలిక సదుపాయాలు, పౌర సేవలు ఇక్కడ అందుబాటులోకి వస్తాయి. కొత్తగా ఇంజినీరింగ్, ప్రణాళిక, ప్రజారోగ్యం, రెవెన్యూ విభాగాలను ఏర్పాటు చేస్తారు. రూర్బన్‌కి ఎంపిక చేసిన పంచా యతీల్లో సిబ్బందిని నాలుగు విభాగాలుగా వారి ఆసక్తిని బట్టి సర్దుబాటు చేయనున్నారు. గ్రామ స్వర్ణ కార్యాలయాల్లో ఉద్యోగుల సేవలూ వినియోగించుకుంటారు.

**లక్షల మంది మహిళలకు నాయకత్వ శిక్షణావకాశాలు**

గ్రామ పంచాయతీల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఎస్.సి, ఎస్.టి, బీసీ కలిపి 75% దాకా రిజర్వేషన్లున్నాయి. జాతీయాదాయంలో 60% రాష్ట్రాల స్థాయిలో కాకుండా, స్థానిక ప్రభుత్వాల్లో కనీసం అందులో సగం ఖర్చు పెట్టి సాధికారతనిస్తే, కేవలం మహిళలకే 14 లక్షలమందికి నాయకత్వ శిక్షణనిచ్చినట్లవుతుంది. అంతమంది మహిళలు స్థానిక ప్రభుత్వాలో ఎన్నికైనవారు ఉన్నారు. రాబోయేకాలంలో అసెంబ్లీ, పార్లమెంటుల్లో 33% అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగంగావించుకుని దేశాన్ని ప్రపంచపటంలో అత్యున్నతస్థాయి దేశాలకు దీటుగా తీసుకెళ్లగలుగుతారు. జనాభాకు అవకాశాలలో అసమతుల్యత చివరికి దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థకే ప్రమాదంగా పరిణమించే అవకాశం ఉంది. చంద్రబాబు, స్టాలిన్ లాంటి నేతలు జనాభా సంఖ్యను పెంచాలి అంటున్నారు. జననాల రేటు పెంచటం కంటే.. ఉన్న జనాభాకి సమ్మిళిత అభివృద్ధి అవకాశాలనివ్వటం నిజమైన 'జనాభా నిర్వహణ' అవుతుంది.

ఏ రంగంలోనూ, ఏ ప్రాంతంలోనూ మితిమీరిన సంఖ్యలో లేకుండా.. జనాభాను హేతుబద్ధంగా సర్దుబాటు చేయటానికి యువ భారత్‌కి "తయారీరంగ ఆర్థిక కేంద్రాలుగా చిన్న పట్టణాలు + గ్రీన్‌ఫీల్డ్ ఎకానమీ కేంద్రాలుగా మహానగరాలు + ప్రభుత్వం చేయాల్సిన ప్రధాన బాధ్యతలైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, సత్వరన్యాయం వంటివి అందించటానికి స్థానిక ప్రభుత్వాలకు వార్డు స్థాయి వరకు ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనమున్న సాధికారత" అత్యుత్తమ పరిష్కారం. ఈ లక్ష్య సాధనలో మనం ఎంత వేగంగా వ్యవహరించగలిగితే, అంత సమర్థంగా ఏఐ విప్లవాన్ని వినియోగించుకోగలం. ✦



# పరాభవమా? అవకాశమా?

ఈసారి ఉగాది పేరే భయపడుతుంది. విజయాల నుండి నేర్చుకునే పాఠాల కంటే.. అపజయాల నుండి నేర్చుకునేవే మన జీవితాల్లో ఎక్కువగా ఉండేలా మానవ మస్తిష్కం రూపుదిద్దుకుని ఉంటుంది కాబట్టి. అయితే.. మన అనుమతిలేకుండా మనల్ని ఎవరూ అవమానించలేరు కనుక - మన లోపాల్ని సరిదిద్దుకోవటానికి తెలుగు నూతన సంవత్సరం 'శ్రీ పరాభవ'ను మనకో గొప్ప అవకాశంగా భావిద్దాం. ఈ నేపథ్యంలో.. జేపీ ఉగాది పోస్టర్ సందేశం:

**1) సంపదసృష్టి:**

☆ ప్రభుత్వోద్యోగం కోసం ఏళ్ల తరబడి కాలయాపన చేయొద్దు

☆ సమాజానికి ఉపయోగపడే ఏ పని ద్వారానైనా డబ్బు సంపాదించే ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకోండి

☆ అలాంటి ఉపాధికి నైపుణ్యాలను.. పాఠశాల స్థాయి నుండి నాణ్యమైన, ఆధునిక సాంకేతికతల విద్య, ఎక్కువ ఉత్పాదక శక్తిని మంచి ఆరోగ్యం ద్వారా పెంపొందించుకోవాలి

**2) కులం:**

☆ శతాబ్దాల అమానుష కులవివక్ష తగ్గుతున్నా రాజకీయం వల్ల కొనసాగుతోంది

☆ ప్రత్యేక చట్టాలు, రిజర్వేషన్లు వంటి కొంతవరకూ ఉపశమనమేగానీ.. అసలు పరిష్కారం మంచి చదువు, ఆరోగ్యం, సాధారణ చట్టాలు అందరికీ సమానంగా అమలవటం, ఎప్పటికప్పుడు నైపుణ్యాల్ని, ఆదాయాల్ని పెంచుకోవటం

☆ మీరు ఎంత నిమ్న కులంలో పుట్టినా.. మేధస్సు, సంపదసృష్టి ఉంటే ఎంతకాలం దూరం పెట్టగలరు? అంబేద్కరే పెద్ద ఉదాహరణ

**3) చదువు:**

☆ అసలు విద్యే రానప్పుడు, పాస్ లు, ర్యాంకులు, డిగ్రీలతో ఉపయోగమేంటి?

☆ ముఖ్యంగా పాఠశాల స్థాయి నుండి మంచి ప్రమాణాల విద్యను నేర్చుకుంటే, గత ఎగ్జామ్ పేపర్లు బట్టీపట్టటం కాకుండా ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం చెప్పగలిగే క్రిటికల్ థింకింగ్ ఉంటే..అదీ మంచి చదువు.

☆ అలాంటి నాణ్యమైన విద్య ఉంటే, కులం, మతం, ప్రాంతం, భాష, ఏవి.. ఏవీ మిమ్మల్ని అవమానించలేవు. జ్యోతి బా ఫూలే, అంబేద్కర్ సహా పలువురు మహనీయుల మొదటిపాఠం ఇదే.

**4) బలగం లేకపోవటం:**

☆ మీకు మద్దతిచ్చేవారు లేకుంటే, ప్రభుత్వ కార్యాలయాల్లో కీలకమైన పనులు జరగవు. పోలీసు స్టేషన్ కి వెళ్లే ధైర్యం చేయలేరు

☆ పొట్ట చేత బట్టుకుని మహానగరానికి వలస వెళ్తే రోజువారీ జీవితంలో కూడా అభద్రత

☆ స్థానిక ప్రభుత్వాలను బలోపేతమై, గ్రామాల మధ్యే చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి గావించుకుంటే.. అప్పుడు మీరే ఒక బలగం అవుతారు, మీలాంటివారు మీ చుట్టూ ఇంకా పెద్ద బలగంగా మారతారు, పౌర సేవలు హక్కుగా, గౌరవప్రదంగా అందుతాయి.

**5) పోలింగ్ రోజున తప్ప ప్రభుత్వాలు పట్టించుకోకపోవటం:**

☆ అధికారమే పరమావధి కావటం వల్ల, ఓటుకి-మన జీవితానికి మధ్య సంబంధం మనకి అర్థంకాకపోవటం వల్ల సమస్య ఇది

☆ దీనివల్ల, ఓటు వేసే రోజు మనం రాజుల్లా భావించుకుంటూ.. నోట్లు, తాత్కాలిక వ్యక్తిగత తాయిలాలు, కులం, ప్రాంతం, మతం వంటి భావోద్రేకాలతో మైమరచిపోయి మిగతా అయిదేళ్లూ పార్టీలకు, రాజకీయ నేతలకు ఔట్ సోర్స్ చేస్తున్నాం

☆ మనకు పంచిన తాయిలాలు, వాళ్లు తిరిగి భర్తీకి అవినీతికి పాల్పడటం.. రెండు రకాలుగా మనం నష్టపోతూ, వచ్చే తరాల భవిష్యత్తుకీ నష్టం చేస్తున్నాం. కాబట్టి దామాషా పద్ధతి సహా ఎన్నికల సంస్కరణల్ని తక్షణ పరిష్కార డిమాండ్‌గా మార్చుకుందాం.

**2026 ఉగాది శుభాకాంక్షలు**

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th April 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001







*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**